J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 14.08.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 11 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## కరోనా పేరుతో...

# శవాలపై చిల్లర ఏరుకుంటున్నారు

- కక్కుర్తి పడుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- భయాన్ని బలహీనంగా తీసుకుని భయంకరంగా దోచుకుంటున్నారు



రోజుకు పాతిక వేలు కట్టమంటున్నారు... ఓ బాధితుడి ఆవేదన. డబ్బులు లేకపోతే ఆస్తి పత్రాలు తాకట్టుపెట్టమంటున్నారు.. మరో సామాన్యుడి ఆక్రందన. బెడ్డు కావాలంటే లక్షరూపాయలు డిపాజిట్ చేయమంటున్నారు.. ఒక కరోనా రోగి ఆక్రోశం. ఇదీ ప్రస్తుతం ఆంధ్రాలో పరిస్థితి. ఓ వైపు ముఖ్యమంత్రి జగన్ కరోనా పేషెంట్ల పట్ల నిర్లక్ష్యం తగదని, తమ ఇష్టానుసారం ప్రైవేటు ఆసుపత్రులు డబ్బు వసూలు చెయ్యడానికి వీలులేదని పదే పదే చెప్తున్నా కొన్ని ఆసుపత్రి వర్గాలు లెఖ్ఖ చేయడంలేదు, అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.

సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పలు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాల వారు పెడచెవిన పెట్టి తమ దోపిడీని కొనసాగిస్తున్నారు. కాసులకోసం కక్కుర్తిపడి శవాలపై చిల్లర ఏరుకుంటున్న తీరుగా ప్రవర్తిస్తున్నారు. రోగుల భయాన్ని, బలహీనతను అడ్డంపెట్టుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

సినిమాల్లో విలన్ పాత్రలు పోషించే బాలీవుడ్ నటుడు సోనూసూద్ లాంటివాళ్లు సమాజంలో హీరో అనిపించుకునే స్థాయిలో కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకోవడానికి ముందుకు వచ్చి సహాయం చేస్తుంటే, కనిపించే దేవుళ్లుగా ప్రజలు భావించే కొందరు డాక్టర్లు చేస్తున్న ఈ నీచపు పని చూసి సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంటోంది.

కరోనా రోగుల కోసం రాత్రనకా పగలనకా కష్టపడుతూ, తమను కన్నవారికి, తాము కన్నవారికీ, కట్టుకున్న వారికీ, అయినవాళ్ళకి దూరంగా (మిగతా 11వ పేజీలో)



## యువనేత చొరవతో...

# పరుగులెత్తనున్న పరిశ్రమలు

పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగన్ 11లో




# నివాళి

గత నాలుగున్నర దశాబ్దాలుగా
నాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు
మా పెద్దాయన
**మల్లెమాల రాధాకృష్ణారెడ్డి గారి**
ఆకస్మిక మృతికి చింతిస్తూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించాలని
భగవంతుడిని ప్రార్థిస్తూ...
మా కన్నీటి నివాళి అర్పిస్తున్నాం.

ప్రొఫెసర్ వెంబులూరు నారాయణరెడ్డి కుటుంబం
సి.ఇ.ఓ., వి పి ఆర్ ఫౌండేషన్

## కాలధర్మం

# 'పల్లె జమీందార్' తిక్కవరపు బలరామిరెడ్డి ఇక లేరు



మైపాడు, ఆ చుట్టుపక్కల గ్రామస్తులందరూ పెద్దాయనా అని పిలిచుకునే వారి పెద్దదిక్కు తిక్కవరపు బలరామిరెడ్డి తన 90వ యేట ఆగష్టు 7వతేదీ కన్నుమూశారు. స్వల్ప అనారోగ్యం(కరోనా కాదు)తో ఇబ్బందిపడుతూ నెల్లూరులోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన 1930, మార్చి 19న జన్మించాడు.

బలరామిరెడ్డి రాజకీయ నాయకుడు కాదు, కానీ ఆయన రాజకీయాలను శాసించేవాడు. ఆయన పట్టభద్రుడు కాదు, కానీ సమాజాన్ని కాచి వడపోశాడు, అందుకే... ఆయనకున్న పరిజ్ఞానం ముందు ఐఏఎస్‌లైనా దిగదుడుపే. ఆయన సంఘ సేవకుడు కాదు, కానీ పేదోళ్ళ గుండెల్లో దేవుడు. ఆపద, అవసరం ఉందంటే నేనున్నానని స్పందించే కరుణామయుడు.

బలరామిరెడ్డి అంటే చుట్టుపక్కల ఊళ్లలో ఒక ధైర్యం, ఆయనంటే ఒక భరోసా. తన బిడ్డలందరూ అత్యున్నత స్థానాలలో మహానగరాలలో స్థిరపడిపోతే ఆయన మాత్రం పల్లె వాసనని, పల్లె వాసులని వదిలిపెట్టలేదు, ఆ ఊర్లో ఆయన కిరీటంలేని మహారాజు, ఎన్నికలతో సంబంధంలేకుండా ప్రజల హృదయాలను శాశ్వతంగా గెలుచుకున్న రారాజు. వారి మనస్సుల్లో కొలువైన మనసున్న మారాజు.

తాను అనుకున్నది సాధించుకోవాలంటే ఆయన ఎంత దూరమైనా వెళ్తాడు, తనతో వున్న వాళ్లకు, తననే నమ్ముకున్న వాళ్లకు మంచి జరుగుతుందంటే ఆయన ఎవరినైనా ఎదిరిస్తాడు, ఎవరితోనైనా విభేదిస్తాడు. శాసించడమే తప్ప ఆశించడం తెలియని నిస్వార్థ ప్రజా సేవకుడు బలరామిరెడ్డి.

తన మాట సహాయంతో ఎంతోమంది యువతకి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించి వారి కుటుంబాలలో బలరామిరెడ్డి వెలుగులు నింపాడు. అనేక మంది అధికారుల బదిలీలు, ప్రమోషన్ల కొరకు సిఫారసు కోసం ఆయనను ఆశ్రయించేవారు. మైపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో సైతం ఎన్నో దేవస్థానాల అభివృద్ధికోసం ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపి నిధులు సాధించేవాడు. ఏ పని చేసినా అన్నిటికి తన జేబులోని డబ్బులే ఖర్చు చేసేవాడు, ఎవ్వరినీ ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టనిచ్చే వాడు కాదు.

కింగ్ కావడంకన్నా కింగ్ మేకర్‌గా వుండడానికే ఆయన మొగ్గు చూపేవాడు. తన ప్రాంతంలో గెలుపోటములను ఆయన తన పరపతి పలుకుబడితో ప్రభావితం చేసేవాడు. ప్రత్యక్ష రాజకీయాలపై ఆయనకు ఎప్పుడూ ఆసక్తి లేకపోయినా ఆజన్మాంతం కాంగ్రెస్ వాదిగా వుండిపోయాడు. అంతే అభిమానాన్ని ఆయన తన చివరి దశలో వైయస్ఆర్ కాంగ్రెస్‌పై కూడా పెంచుకున్నాడు.

వందేళ్ల వయసు కలిగిన మూడంతస్తుల తన ఇంటికి చీకటిని ఆయన దరిచేరనీయ లేదు. రాత్రి 11 దాటినా ఇంట్లో లైట్లు వెలుగుతూనే ఉండేవి. నిత్యం ఏదోఒక సమస్యకు ఆ భవనంలో పరిష్కారం దొరుకుతూనే ఉండేది. ఇంటి దీపాలకన్నా ఆ ఇంట్లో తమకు న్యాయం జరిగిన వారి ముఖాలలోనే ఎక్కువ కాంతి కనిపించేది. అందుకే నూరేళ్లు నిండినా ఆ ఇల్లు దేదీప్యమానంగా ప్రకాశిస్తూనే ఉంటుంది. నొప్పించకుండా ఒప్పించి అందరికి సమన్యాయం చేయడంలో బలరామిరెడ్డి సమర్థుడు. కాబట్టే ఆయన ఆ ప్రాంతానికి పెద్దరెడ్డి, ఒక అభిమాని చెప్పినట్లుగా 'పల్లె జమీందారు'.


బలరామిరెడ్డికి భార్య హైమావతమ్మ, కుమారులు సీతారామ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కుమార్తెలు కమల, షీల. బలరామిరెడ్డిలో అటు ప్రాచీన భావాలు ఇటు ఆధునిక పోకడలు రెండూ వున్నాయనడానికి ఆయన సంతానానికి ఆయన పెట్టిన పేర్లే పెద్ద ఉదాహరణ, కొడుకులకి సీతారాముడు, రామచంద్రుడు అని పురాణ పేర్లను పెట్టి, కూతుర్లకు కమల, షీల అని ఆధునిక పేర్లు పెట్టాడు.

90 సంవత్సరాల బలరామిరెడ్డి పేరుకే పాత తరం పెద్దాయన అయినా తనను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకుంటూ మారుతున్న సమాజంతో పాటు తానూ మారుతూ వచ్చాడు.

బలరామిరెడ్డి పెద్దల్లుడు దినేష్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో డిజిపి హోదాలో పోలీస్ బాస్‌గా పదవీ విరమణ పొందాడు. రెండవ అల్లుడు శివకుమార్‌రెడ్డి వ్యాపారవేత్త.

ప్రేమానురాగాలు కురిపించే భర్తగా, ఆదర్శవంతమైన తండ్రిగా, 7 మంది మనుమలు మనుమరాళ్ళకు ఆత్మీయత పంచిన తాతగా, ప్రజలకోసం పరితపించే మానవతావాదిగా, మానవత్వం మూర్తీభవించిన పరిపూర్ణ వ్యక్తిగా 90 సంవత్సరాలు జీవించి తనువు చాలించిన బలరామిరెడ్డి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి పితృ వియోగం



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్ట్ బోర్డు సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాన్న మల్లెమాల రాధాకృష్ణరెడ్డి(86) ఆగష్టు 10వతేది సాయంత్రం అనారోగ్యంతో(కోవిడ్ కాదు) తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య రమణమ్మ, కుమార్తె ప్రశాంతి, కుమారుడు సతీష్‌రెడ్డి కాగా కుమారుడు చాలా ఏళ్ళ క్రితమే ప్రమాదంలో అసువులు బాశాడు.

రాధాకృష్ణారెడ్డి సొంతూరు చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని పునబాక. తన బిడ్డల చదువుకోసం ఆయన తిరుపతిలో స్థిర నివాసం ఏర్పరచుకుని ఇద్దరు పిల్లల్ని బాగా చదివించాడు.

తిరుపతితోనే ఆయనకు ఎక్కువ సంబంధాలు, అనుబంధాలు వున్నాయి. ఎస్‌వి యూనివర్సిటీ సమీపంలో హోటల్ వ్యాపారం ప్రారంభించి నిర్వహిస్తుండడంతో యూనివర్సిటీలో చదువుకునే స్టూడెంట్స్‌తో పాటు క్యాంపస్‌లో పనిచేసే అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనతో చాలా సన్నిహితంగా మెదిలేవారు. పెద్దతరం వ్యక్తిగా అందరికి కష్ట సుఖాలలో ఆయన అండగా ఉండేవాడు. దాతృత్వం, ఆధ్యాత్మికతత్త్వం ఎక్కువగా ఉండడంతో సౌమ్యుడిగా, సద్గుణ సంపన్నుడిగా అందరిలోనూ పేరు తెచ్చుకున్నాడు. అందరూ అయనను ఒక హితైషిలా భావించేవాళ్లు.

ఇద్దరు పిల్లల పెళ్లిళ్ల అనంతరం ఆయన నెల్లూరుకి వచ్చి స్థిరపడిపోయాడు. నెల్లూరులోని మాగుంట లే అవుట్‌లో కుమార్తె ప్రశాంతితో వుంటూ సోమవారం (ఆగష్టు 10) నాడు ఆకస్మికంగా అందరినీ వదిలి వెళ్ళిపోయాడు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ ఆయన మృతికి నివాళు లర్పిస్తోంది 'లాయర్'.

### అన్ని వర్గాల ప్రజలకు

# మేలుచేస్తున్న ముఖ్యమంత్రి జగన్

**- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషిచేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి అమలుచేస్తున్నారని, ముఖ్యంగా అన్నదాతలకు అండగా ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 10న ఆయన తడ మండలంలోని పులివేంద్ర గ్రామంలో ఏఎంసి పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికాలంలోనే సిఎం జగన్ రైతుల పక్షపాతిగా మంచిపేరు తెచ్చుకున్నారన్నారని, అందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు తిరుగులేని ప్రజామద్దతు లభిస్తోందని చెప్పారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఎంతోకాలంగా పరిష్కారానికి నోచుకోని సాగునీటి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగనన్న, నీటి పారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌లు నిధులు కేటాయించి రైతుల గుండెల్లో ప్రత్యేక స్థానం పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, దువ్వూరు గోపాల్‌రెడ్డి, రఘు, అనిల్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, దబ్బల శ్రీమంత్‌రెడ్డి, రాజసులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సోముకు నెల్లూరు బిజెపి నాయకుల శుభాకాంక్షలు

బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడు సోము వీర్రాజును ఈనెల 10న విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నెల్లూరుకు చెందిన బిజెపి నాయకులు కోటా వెంకటేశ్వర్లు, కాలం బుజ్జిరెడ్డి, ముక్కు రాధాకృష్ణ తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

### వ్యాధిగ్రస్తులైన టీచర్లకు

## 'నాడు-నేడు' నుంచి మినహాయింపు ఇవ్వాలి

దీర్ఘకాల వ్యాధులతో బాధలుపడుతున్న ఉపాధ్యాయులకు నాడు-నేడు పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తులసీరాంబాబు, నవకోటేశ్వరరావు ఒక ప్రకటనలో జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. మనుబోలు పాఠశాల హెడ్మాస్టర్ మృతికి వారు ఈ సందర్భంగా తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

## దుకాణాలకు జరిమానాలు

నెల్లూరు నగరంలోని పలు దుకాణాల వారు కోవిడ్ నిబంధనలు పాటించనందుకు వార్డు సచివాలయాల పారిశుద్ధ్య విభాగం సెక్రటరీలు వారికి జరిమానాలు విధించారు. ఈనెల 10న దుకాణాలను తనిఖీచేసి కోవిడ్ నిబంధనలు పాటించని, ట్రేడ్ లైసెన్సులు, ఎన్‌ఓసిలు లేని దుకాణాలను గుర్తించి జరిమానాలు విధించారు.

### ఉదయగిరి నుంచి విశాఖకు

## సూపర్ లగ్జరీ బస్సు

జిల్లాలోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరి ఆర్టీసి డిపో నుంచి విశాఖపట్నానికి సూపర్‌లగ్జరీ బస్సు సౌకర్యం ఈనెల 10 నుంచి ప్రారంభమైంది. ఈ బస్సు ప్రతి రోజు సాయంత్రం 4.30గంటలకు ఉదయగిరి నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30గంటలకు విశాఖపట్నంకు చేరుకుంటుంది. అదేవిధంగా అక్కడ సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి ఉదయగిరికి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుకుంటుందని ఆర్టీసి వర్గాలు తెలిపాయి.



# జర్నలిస్టులను ఆదుకుంటాం

**జేసీ ప్రభాకర్‌రెడ్డి హామీ**

ఈ కరోనా కష్టకాలంలో జిల్లాలోని జర్నలిస్టులను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి జర్నలిస్టు నాయకులకు హామీ ఇచ్చాడు. ఈనెల 9న ఏపియుడబ్ల్యుజె నాయకులు జయప్రకాష్, వెంకటేశ్వర్లు జేసీని కలిసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. జర్నలిస్టులకు కరోనా పరీక్షలతో పాటు చికిత్సలకు ప్రత్యేక వార్డు కేటాయించాలని ఈ సందర్భంగా జేసీని కోరగా, అందుకు జేసీ స్పందిస్తూ కరోనాతో బాధపడుతున్న జర్నలిస్టులకు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక వార్డును కేటాయిస్తామని కూడా హామీ ఇచ్చాడు.

# విలేకరి చక్రపాణి కన్నుమూత



సీనియర్ జర్నలిస్టు, ఇందుకూరుపేటలో పలు దినపత్రికల్లో విలేకరిగా పనిచేసిన జి.చక్రపాణి తన 65వ ఏట అనారోగ్యంతో ఈనెల 11వ తేది రాత్రి కన్నుమూశాడు. ఏపి యుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షునిగా, జాయింట్ సెక్రటరీగా, నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా కూడా ఆయన సేవలందించాడు. విలేకరిగా, యూనియన్ నాయకునిగా పత్రికారంగానికి సేవలందించడమే కాక సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించేవాడు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న, ఎంపిడిఓ రఫీఖాన్, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, వీరేంద్ర తదితరులు చక్రపాణి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. జిల్లా జర్నలిస్టులు, యూనియన్ నాయకులు ఆయన మృతికి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

# జర్నలిస్టు మూర్తి ఆకస్మిక మరణం



నెల్లూరు నగరానికి చెందిన జర్నలిస్టు మూర్తి కరోనా వైరస్‌తో పోరాడుతూ మంగళవారం వేకువన మృతిచెందాడు. నెల్లూరు జర్నలిస్టుల క్రికెట్ టీమ్ మేనేజర్‌గా మూర్తి మంచిపేరు సంపాదించుకున్నాడు. వృత్తిరీత్యా ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తూ అందరికీ స్నేహపాత్రునిగా ఉండేవాడు. ఆయన ఆకస్మిక మృతి బాధాకరమని అంటూ ఏపియుడబ్ల్యుజె నాయకులు ఏ.జయప్రకాష్, వల్లూరు వెంకటేశ్వర్లు, సామ్నా జిల్లా నాయకులు సర్వేపల్లి రామ్మూర్తి, గడ్డం హనోక్ తమ సంతాపం తెలిపారు.



# అభివృద్ధి మళ్ళీ మొదలైంది

- సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి

కరోనా నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధిపనులు తిరిగి ప్రారంభమయ్యాయని, సుమారు 180 కోట్ల రూపాయల వ్యయంతో తమ నియోజకవర్గంలో డ్రైన్లు, సిసిరోడ్ల నిర్మాణపు పనులు చేపడుతున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 9న ఆయన పొదలకూరు రూరల్ మండలంలోని దుగ్గుంట, రామాపురం గ్రామాల్లో పర్యటించి ఆ గ్రామాల్లో కోటీ 38 లక్షలతో నిర్మించిన రోడ్లను ప్రారంభించాడు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో ప్రభుత్వం ప్రతి ప్రాంతంలో ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అమలుచేస్తోందని కొనియాడాడు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిడిఓ నారాయణరెడ్డి, మాజీ ఎంపిపి కోనం బ్రహ్మయ్య, గోగిరెడ్డి, రమణారెడ్డి, రామిరెడ్డి, కొండపనాయుడు తదితరులున్నారు.

# జాయింట్ కలెక్టర్ డా.వినోద్‌కుమార్ బదిలీ



జిల్లా జాయింట్ కలెక్టర్ డా.వినోద్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన్ను రాష్ట్ర హెల్త్ సిస్టమ్స్ ట్రైనింగ్ ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా బదిలీచేస్తూ ఈనెల 11న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలంసాహ్ని ఉత్తర్వులిచ్చారు. జిల్లాలోని మరో జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఈ స్థానంలో నియమిస్తూ అదనపు బాధ్యతలిచ్చారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన డా.వినోద్‌కుమార్ నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్‌గా 11నెలల క్రితం ఇక్కడికి వచ్చారు. పాలనా పరంగా ఆయన జిల్లాలో ఎన్నో అభివృద్ధిపనులను వేగవంతం చేస్తూ తనదైన పాలనా దక్షతతో పనిచేశారు. మంచి అధికారిగా పేరుపొందారు. అయితే, సరిగ్గా ఏడాది కూడా పూర్తికాకముందే ఆయన బదిలీకావడం జిల్లాలో చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల క్రితం వరకు జిల్లా కలెక్టర్‌గా ఉన్న శేషగిరిబాబు బదిలీ కావడం, ఇప్పుడు సంయుక్త కలెక్టర్ వినోద్‌కుమార్ బదిలీ కావడంతో ఈ ఏడాదిలోనే ఇద్దరు ఐఏఎస్ అధికారుల బదిలీలు కావడం పట్ల జిల్లా అధికారవర్గాలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నాయి.

# జేసీ(ఆసరా)గా కృష్ణభారతి నియామకం


- డిఆర్‌ఓగా వస్తున్న ఎం.వి రమణ
- కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి బదిలీ

సిఆర్‌డిఏ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.కృష్ణభారతిని జిల్లా జాయింట్ కలెక్టర్ (ఆసరా)గా నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 12న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది డెప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లును ప్రభుత్వం బదిలీచేసింది. నెల్లూరు డిఆర్‌ఓగా పనిచేస్తున్న జి.మల్లికార్జునను టిటిడి ఎస్టేట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. శ్రీకాకుళం ఆర్డీఓ ఎంవి రమణను జిల్లా రెవెన్యూ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డిని ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ (ఆసరా)గా నియమిస్తూ ఇక్కడినుంచి బదిలీ చేశారు. విజయవాడ సివిల్‌సప్లయిస్ శాఖలో పనిచేస్తున్న ఎం.శ్రీదేవి నెల్లూరుజిల్లా సివిల్ సప్లయిస్ విజిలెన్స్ డెప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. బిసి కార్పొరేషన్ ఇ.డి టి.రాజగోపాల్‌ను కడప జిఎన్ఎస్ఎస్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ తాజా ఉత్తర్వులిచ్చారు.




ఈ నెల 13వ తేదీ గూడూరు నూతన డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎం.రాజగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గూడూరు టౌన్ సి.ఐ జి.దశరథరామారావు, రూరల్ సి.ఐ రామకృష్ణారెడ్డి, ఎస్.ఐ బ్రహ్మంనాయుడు

# ఆగని.. కరోనా కల్లోలం



- జిల్లాలో 16,019కు చేరుకున్న బాధితులు
- 196కి చేరిన మరణాలు

కరోనా వ్యాధి కల్లోలం జిల్లాలో కొనసాగుతూనే ఉంది. దీని ధాటికి ప్రజా జీవనం స్తంభించిపోయింది. ఎక్కడ చూసినా కరోనా మాటలే!.. కాస్త తగ్గిందనుకునే లోపలే మళ్ళీ కరోనా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఎంతోమంది ఈ వ్యాధికి గురై నానాకష్టాలు పడుతున్నారు. బుధవారం ఒక్కరోజే 723 మంది ఈ వ్యాధి బారినపడ్డారు. 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో అయిదుగురు పురుషులు, అయిదుగురు స్త్రీలు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పెద్దాసుపత్రిలో చికిత్సలు పొందుతూ మృతిచెందడంతో వారి కుటుంబాలు శోక సముద్రంలో మునిగిపోయాయి. ఈనెల 12వ తేది నాటికి కేసుల సంఖ్య విజృంభించి 15,337కు చేరుకుంది. మరణాల సంఖ్య 196కి చేరింది. ఇప్పటివరకు నమోదైన కేసుల్లో ఇప్పటిదాకా 10052 మంది కోలుకుని ఇళ్లకు వెళ్లిపోవడం ఎంతో ఊరట కలిగిస్తోంది. మరో 6718 మంది నారాయణ ఆసుపత్రి, పెద్దాసుపత్రి, నెల్లూరు ఆసుపత్రుల్లోను, కోవిడ్ కేర్ సెంటర్లలోనూ చికిత్సలు పొందుతున్నారు. చికిత్స పొందుతున్న ఒక జర్నలిస్టు పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. మనుబోలు జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రమేష్‌కుమార్ కరోనాతో మృతిచెందాడు.

# ధాన్యం రైతులకు న్యాయం చేయండి

- రైతుసంఘాల సమాఖ్య విన్నపం

జిల్లాలో వ్యాపారులు ధాన్యం ధర తగ్గించి కొంటున్నారని, దీంతో రైతులు నష్టాలపాలవుతున్నారని రైతుసంఘాల సమాఖ్య నెల్లూరుశాఖ నాయకులు చిరసాని కోటిరెడ్డి, వి.నిరంజన్‌రెడ్డి, పి.హనుమంతరావునాయుడు, ఎవిఆర్ నాయుడు, నర్సయ్య, డి.సోమశేఖర్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఈనెల 12న వినతిపత్రంలో విన్నవించుకున్నారు. జిల్లాలో రెండోపంటకు మీరు సాగునీరందించినా, కూలీలు అందుబాటులో లేకున్నా ఎంతో కష్టపడి పెట్టుబడులు పెట్టి పంటలు పండించినా ధాన్యం దిగుబడులు మూడు పుట్ల లోపే వస్తున్నాయని, ఇప్పుడు వాటిని అమ్మబోతే అడవి అన్నట్లుగా పరిస్థితి తయారైందని వారు మంత్రికి ఆ వినతిపత్రం ద్వారా తెలుపుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పి ప్రకారం పుట్టి (850 కేజీలు) ఏ-గ్రేడ్ రకం రూ. 15,597-50 అయితే వ్యాపారులు ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందనిచెప్పి 4600 తగ్గించి, 11వేల రూపాయలకు, అంతకంటే తక్కువకు కొంటున్నారని వారు పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్నందున రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు అవకాశం ఉండడం లేదని, ఈ విషయాలను పరిశీలించి రైతులకు కనీస మద్దతు ధర అందేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తేమశాతాన్ని పరిగణించిన ధరలకు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుని అన్నదాతలకు న్యాయం చేయాలని వారు కోరారు.

# మద్యం షాపులను మూసేయాలి

రాష్ట్రంలో మద్యం షాపులు తెరవడం వల్ల కరోనా వ్యాధి మరింతగా వ్యాపిస్తోందని, ప్రభుత్వం వెంటనే మద్యం షాపులను మూసివేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి కోరారు. ఈనెల 9న కోవూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా పెరుగుతోందని బళ్లు, గుళ్ళు అన్నీ మూసేసిన ప్రభుత్వం మద్యంషాపులు తెరవడం ఏమిటని ప్రశ్నించారు. మద్యం ధరలను విపరీతంగా పెంచడంతో మద్యానికి అలవాటుపడిన వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, మద్యం దుకాణాలను మూసివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు విజయ్‌బాబు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ధాన్యానికి గిట్టుబాటు ధర ఇస్తున్నాం

- వ్యవసాయశాఖ ఏ.డి గోపీనాయక్

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడిఏ గోపీనాయక్ చెప్పారు. ఈనెల 9న ఆయన పెళ్లకూరు మండలంలోని రైతులకు చిల్లకూరు పిఏసియస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ శ్రీనివాసులుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నాడు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరాడు.

# 'అక్షర'యోధుని అస్తమయం

## సీనియర్ జర్నలిస్ట్ మార్కండేయులు మృతి బాధాకరం



జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా ఉంటూ పలు పత్రికల్లో పనిచేసిన జొన్నలగడ్డ మార్కండేయులు (75) ఈనెల10న నెల్లూరులోని తన నివాసంలో అస్వస్థతతో కన్నుమూశాడు. ఆయన మృతి ఎంతో బాధాకరం. వివాదాల జోలికి పోని మంచి వ్యక్తి ఆయన. సౌమ్యుడు.. స్నేహపాత్రుడు కూడా. నెల్లూరులో వివిధ పత్రికల్లో దీర్ఘకాలం పనిచేసి పాత్రికేయరంగంలో నీతినియమాలకు ప్రతీకగా రాణించి మంచిపేరు తెచ్చుకున్నాడు. ప్రత్యేకించి ఏసియన్ లోకల్ టీవీ ఛానల్ ఏర్పాటైన కొత్తల్లో జిల్లాలో వార్తలు సేకరించి ప్రసారం చేయడానికి ఆయనే ఆద్యుడు. ఎన్నో పరిశీలనాత్మక వార్తలకు, మానవీయ కథనాలకు ప్రాధాన్యతనిచ్చేవాడు. అంతేకాదు, ఆయన మంచి సాహిత్యాభిలాషి.. నిరంతర అధ్యయనశీలి. భాషమీద పట్టున్న వ్యక్తి. ఉత్తమ పాత్రికేయుడుగా రాణించడమే కాక, గతంలో అంకితం పేరుతో సాహిత్య పత్రికను కూడా నడిపి సాహిత్యరంగంలోనూ ప్రతిభతో రాణించి అందరి అభినందనలు అందుకున్నాడు. 'లాయర్' వారపత్రికలో కూడా కొంతకాలం ఎంతో నిబద్ధతతో పనిచేశాడు. మంచి వార్తాకథనాలు, వ్యాసాలతో అందరి మన్ననలు పొందాడు. సాహితీలోకంలో అందరూ మెచ్చదగిన 'అక్షర' వంటి బృహత్తరమైన గ్రంథాల రూపకల్పనలో తనవంతు కృషి చేశాడు. ముక్కుసూటి వ్యక్తిత్వం, ఏ విషయాన్నయినా కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం ఆయన నైజమైనా ఎవరినీ కించపరిచినట్లు మాట్లాడడం ఎరుగడు. అలాంటి పాత్రికేయుడు మరణించడం పాత్రికేయ రంగానికి తీరని లోటు. ఆయన సతీమణి కూడా కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. వీరి కుమారుడు కోణార్క్ ప్రస్తుతం మీడియా రంగంలో పనిచేస్తున్నాడు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే జిల్లాలోని పలువురు జర్నలిస్టులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జిల్లాలో ఒక మంచి పాత్రికేయునిగా, ఉత్తమ సాహితీవేత్తగా రాణించి.. కడదాకా అక్షరాలనే స్మరించుకుంటూ జీవితయాత్ర సాగించిన ఆ అక్షరయోధుని మరణానికి తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలుపుతోంది..'లాయర్'.

## 'ప్రభా'తం

# 2 కోట్లు దాటేసిన కరోనా

ప్రపంచవ్యాప్తంగా కరోనా కల్లోలం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ప్రపంచంలో కరోనా కేసుల సంఖ్య 2 కోట్లు దాటేసింది. మరోవైపు మొట్ట మొదటిసారిగా రష్యాలో కరోనా నిరోధానికి వ్యాక్సిన్ సిద్ధమవుతోందన్న తాజా సమాచారం ప్రపంచ ప్రజలకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. కరోనా వ్యాక్సిన్‌ను తయారుచేసిన తొలిదేశంగా రష్యా రికార్డు సృష్టించిందని, దాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజా ప్రకటన..ప్రపంచానికో పెద్ద ఊరడింపేనని చెప్పక తప్పదు.

ప్రపంచవ్యాప్తంగా కరోనా కల్లోలం కొనసాగుతూనే ఉంది. ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తూనే ఉంది. ఈనెల 11వ తేది నాటికి ప్రపంచంలో కరోనా పాజిటివ్ కేసులు 2 కోట్ల భారీ సంఖ్యను దాటేశాయి. మొత్తంగా కేసుల సంఖ్య 2 కోట్లా 11వేలా 186 కేసులు నమోదయ్యాయంటే ఈ మాయదారి వ్యాధి ఎంతగా విజృంభిస్తోందో అర్థమవుతుంది. ఇప్పటికే ఈ వ్యాధి దెబ్బకు ప్రపంచమంతా ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. ఆర్థికవ్యవస్థలన్నీ అతలాకుతలమైపోయాయి. అన్ని దేశాల్లోనూ అభివృద్ధి మందగించింది. అమెరికా, బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా, మెక్సికో, పెరూ, కొలంబియా, చిలీ, స్పెయిన్, బ్రిటన్, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇరాన్, సౌదీ అరేబియా, బంగ్లాదేశ్, అర్జంటైనా, టర్కీ, ఇరాక్, ఫిలిప్పైన్స్, ఇండోనేషియా, కెనడా, ఈజిప్ట్ వంటి అనేకదేశాల్లో కరోనా వీరవిహారం చేస్తూనే ఉంది. మనదేశంలో కూడా కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. అమెరికా, బ్రెజిల్ తర్వాత మనదేశంలోనే కేసులు అధికంగా ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం కరోనా కేసుల్లో సగానికిపైగానే ఈ మూడు దేశాల్లో ఉన్నాయంటే కరోనా ఎంత విస్తృతంగా ఉందో ఊహించుకోవచ్చు. గత జూన్ నెలాఖరుకు కోటి దాటిన కరోనా కేసులు జులై మూడోవారానికి ఒకటి న్నర కోట్లకు పెరిగి, ఈ మూడు వారాల్లోనే మరో 50 లక్షల కేసుల దాకా నమోదై మొత్తంగా ఇప్పటికి 2కోట్లు దాటేయడం గమనార్హం. అంతేకాదు, ఈ కరోనా రాకాసి బారినపడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య కూడా భారీగానే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికి 7లక్షలా34వేల మందిని ఈ వ్యాధి పొట్టన పెట్టుకున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి.

మనదేశం పరిస్థితి చూస్తే.. ఈనెల 11 నాటికి మొత్తం కేసుల సంఖ్య 22,68,675కు చేరుకోగా, మృతుల సంఖ్య 45,257కు చేరింది. అయితే మనదేశంలో ఇప్పటికి సుమారు 15 లక్షల మందికి పైగానే ఈ వ్యాధి నుంచి కోలుకున్నారని, మరణాల సంఖ్యలో అతితక్కువ శాతంలో మనదేశం ఉందని భారత ఆరోగ్యమంత్రిత్వ శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో కరోనాతో చికిత్స పొందుతున్న యాక్టివ్ కేసులు 6,39,929 దాకా ఉన్నాయి. ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా నమోదైన కేసుల్లో ఇది 28.21 శాతంగా ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈనెల 11 నాటికి మనదేశంలో కరోనా రికవరీ రేటు 69.8శాతం ఉంటే, మరణాల రేటు 1.99శాతం కావడంతో మరణాల రేటు 2 శాతం కంటే తక్కువకు వచ్చిందని, అయితే మృతుల్లో 70 శాతానికి పైగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంటోంది. అందువల్ల మనదేశంలో కరోనా కేసులు అత్యధికంగానే ఉంటున్నప్పటికీ మరణాల సంఖ్య తగ్గుతుండడం, కరోనా నుంచి కోలుకునేవారి సంఖ్య పెరుగుతుండడమే కాక ఆ పెరుగుదల కూడా రెట్టింపు సంఖ్యలో ఉండడం ఎంతో ఊరట కలిగించే విషయం. దేశంలో చికిత్స పొందుతున్న రోగులు 6,39,929 మంది ఉంటే, కోలుకుని డిశ్చార్జి అయినవారు 15,83,498 మంది ఉన్నారు. దీన్నిబట్టి చూస్తే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే కరోనా నుంచి కోలుకో వచ్చనే విషయం అర్థమవుతుంది. అంతేకాదు కరోనా పట్ల భయాందోళనలు అక్కరలేదని, ముందు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సత్ఫలితాలుంటాయని కూడా తేటతెల్లమవుతుంది.

కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్నాయనో, మరణాలు సంభవిస్తున్నాయనో తెలిసి ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేనే లేదని ఆరోగ్యనిపుణులు స్పష్టంగా చెప్తున్నారు. ఎందుకంటే, గతంలో కంటే ఇప్పుడు ఈ వ్యాధిని ఎలా నియంత్రించాలో వైద్య నిపుణులకు బాగా స్పష్టత వస్తోందని, కాబట్టి కరోనా అంటే భయపడి ప్రాణాలమీదికి తెచ్చుకోకుండా ధైర్యంగా కరోనాని ఎదుర్కోవాలని వారు సూచిస్తున్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, రోగనిరోధకశక్తిని పెంపొందించు కోవడం, కరోనా నియంత్రణకు ప్రభుత్వాలు, వైద్యనిపుణులు సూచిస్తున్న నియమాలను తప్పనిసరిగా పాటించడం, ముఖ్యంగా మాస్కును ధరించడం, చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకుంటుండడం, భౌతికదూరం పాటిస్తుండడం, ప్రతి ఒక్కరూ స్వీయనియంత్రణ పాటిస్తూ, మరీ అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళకుండా ఉండడం, గుంపులుగా రోడ్ల మీద తిరగకుండా ఉండడం వంటి సూచనలన్నీ తప్పనిసరిగా పాటిస్తుండడం ఈ పరిస్థితుల్లో అంద రికీ ఎంతో శ్రేయస్కరమని అంటున్నారు.

ఇదిలావుంటే, ప్రపంచమానవాళి మొత్తం అలు పెరుగకుండా కరోనా రాకాసిపై చేస్తున్న యుద్ధం త్వరలోనే ఒక ముగింపునకు వచ్చే సూచనలు కని పిస్తున్నాయి. కరోనా నియంత్రణకు వ్యాక్సిన్ అందు బాటులోకి వస్తోందనే సమాచారం కోసం, ఆ వ్యాక్సిన్ కోసం ప్రపంచమంతా ఎంతో ఆశతో ఎదురు చూస్తోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎందరో శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులు కరోనా ఆట కట్టిం చేందుకు నిరంతరం కంటికి కునుకు లేకుండా ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. కరోనా నిరోధానికి ఇప్పుడు మొట్టమొదటి సారిగా రష్యాలో వ్యాక్సిన్ సిద్ధమవుతోందన్న తాజా సమాచారం ప్రపంచప్రజలకు ఎంతో ఊరటనిస్తోంది. కరోనా వైరస్ నిరోధానికి వ్యాక్సిన్‌ను తయారుచేసిన తొలి దేశంగా రష్యా రికార్డు సృష్టించిందని, సెప్టెంబర్‌లో భారీస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించి అక్టోబర్ నుంచి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈనెల11న ప్రకటించడం.. ఈ విపత్తు వేళ ప్రపంచానికో శుభవార్త. అయితే, రష్యా వ్యాక్సిన్ సామర్థ్యంపై కొంతమంది శాస్త్రజ్ఞుల్లో సందేహాలున్నా, వ్యాక్సిన్ తుది దశ పరీక్షలు పూర్తికాక ముందే దీనికి అనుమతులు ఇవ్వడంపై, దాని భద్రతా ప్రమాణాలపై నిపుణుల నుంచి విమర్శలొస్తున్నా.. ఈ వ్యాధిని అరికట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న ప్రయోగాల్లో ఇది ఓ గొప్ప ముందడుగేనని వేరే చెప్ప నక్కరలేదు. ఆ వ్యాక్సిన్ అన్నిరకాల పరీక్షలు విజయవంతంగా పూర్తిచేసుకుని అందుబాటులోకి వస్తే..ఇక ప్రపంచానికి మంచిరోజులు వచ్చినట్లేనని భావించవచ్చు. ఏదేమైనా కరోనా వ్యాక్సిన్ మాత్రం త్వరలోనే రావాలని, రాకాసి కరోనా అంతం కావాలని ప్రపంచ మానవాళి అంతా కోటానుకోట్ల కళ్ళతో ఎదురుచూస్తోంది. ఆ మంచిరోజు అత్యంత త్వరలోనే వస్తుందని ఆశిద్దాం!...

---

## మోడీ గారి మాటలు మంత్రముగ్ధుల్ని చేశాయి

ఆగస్టు 5వతేది అయోధ్యలో జరిగిన రామమందిరం శంకుస్థాపన మహోత్సవం సందర్భంగా మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి ఉపన్యాసం ప్రపంచ వ్యాప్తంగా వున్న భారతీయులని మంత్రముగ్ధులని చేసింది. 2020, ఆగస్టు 5వతేదీ భారత దేశ చరిత్రలో ఒక చిరస్మరణీయ రోజుగా మిగిలిపోతుందని ప్రధాని చెప్పడం, మరీ ముఖ్యంగా 1947,ఆగస్టు15 మన దేశానికి స్వాతంత్రం వచ్చిన రోజుతో ఈ భూమి పూజ రోజుని పోల్చి అంతే ప్రాముఖ్యతతో ఈరోజును కూడా భావితరాలు గుర్తుపెట్టు కుంటాయని చెప్పడం అందరికీ నచ్చింది. దాదాపు 35 నిముషాల సేపు మాట్లాడిన ఆయన, అటు కాశ్మీరం నుండి ఇటు కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాల ప్రజలు శ్రీరామునిపై చూపిస్తున్న భక్తి భావాన్ని గురించి ప్రస్తావించి 'అంతా రామ మయం.. ఈ జగమంతా రామమయం' అని చెప్పకనే చెప్పేశాడు. వందల సంవత్స రాల భారతీయుల ఆకాంక్షను నిశ్శబ్దంగా, నిరాడంబరంగా, నిర్భయంగా నెరవేర్చిన ధీరోదాత్తుడికి నమోవాకాలు.

**ఎం.చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.**

## మహనీయులను మరువకూడదు

మన నెల్లూరు జిల్లాలో నాటి తరం బెజవాడ గోపాలరెడ్డి గారి దగ్గరి నుండి నేటి తరం మాగుంట సుబ్బరామిరెడ్డి గారి వరకు ఎంతో మంది త్యాగధనులు జిల్లా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. రాజకీయ రంగాన్ని వేదికగా చేసుకుని ప్రజా సేవ చేసిన పుచ్చలపల్లి సుందరయ్య, ఏసి సుబ్బారెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వంటి వాళ్ళు ఎంతోమందిని జిల్లా ఎన్నటికీ మర్చిపో కూడదు. బెజవాడ గోపాలరెడ్డిగారి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదని 'లాయర్'లో చదివి బాధేసింది. ఆ తరు వాత వారం కనీసం మాగుంట శ్రీనివా సులరెడ్డి గారు, చేవూరు దేవకుమార్‌రెడ్డిలు ఆయనను పట్టించుకున్నారని చదివి తృప్తి కలిగింది. గోపాలరెడ్డిగారి కుమారులు ఆయన ఆస్తికి వారసులయ్యారు తప్ప ఆయన ఆశయాలకు వారసులు కాలేక పోయినట్లుంది. తమ త్యాగాలతో రేపటి తరానికి స్ఫూర్తిని నింపిన ఇలాంటి వారి విగ్రహాలు పెట్టేది అలంకరణ కోసం కాదు. కనీసం ఏడాదిలో ఒకసారైనా వారిని తల్చుకుని వారి సేవలను స్మరించు కుంటే నేటి పౌరులతో పాటు రేపటి తరాలకు కూడా వారి గురించి తెలిసి తాము కూడా వాళ్లంతటి వాళ్ళం కావా లనే ఆలోచన, తపనా వారిలో కలగాలనే సంకల్పంతోనే విగ్రహాలు పెడతారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడమే కాకుండా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి క్యాబినెట్‌లో మంత్రిగా, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన గోపాలరెడ్డి గారి వంటి వారిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అన్యాయం. ఒక్క గోపాలరెడ్డి గారినే కాదు మన కోసం ఉద్యమించి మన కోసం పరితపించిన మహనీయులని ఎవరిని మరచినా అది మహా పాపమే.

**ఎం.మురళీ, కావలి.**

## కోవిడ్ పేరుతో దోచేస్తున్నారు

కరోనా సోకిన వారిని అనేక ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఇప్పుడు ప్రైవేటు నర్సింగ్ హోంలలో కూడా చేర్చుకోవాలని గవర్నమెంటు ఆదేశాలు ఇవ్వడంతో ప్రైవేటు ఆసుపత్రుల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. ప్రాణాలు పోతాయేమో అని ఆందోళన చెందుతున్న సామాన్యుడిని భయపెట్టి వేలకు వేలు గుంజుతున్నారు. కొన్ని ఆసుపత్రులలో అయితే నెగటివ్ వచ్చినా పాజిటివ్ వచ్చిం దని భయపెట్టి ఆసుపత్రులలో చేర్చుకుం టున్నారు, ఇలా చేర్చుకోవడంతో ఆసుపత్రు లలో బెడ్లు కరువై చాలామంది నిజమైన బాధితులు అల్లాడుతున్నారు. మొన్న విజయవాడలో జరిగిన స్వర్ణ ప్యాలస్ అగ్ని ప్రమాదాన్నే తీసుకుంటే అక్కడ చనిపోయిన 10మందిలో 8 మందికి నెగటివ్ వచ్చింది. చనిపోయిన 10 మందికీ పరీక్షలు జరిపితే ఈ నిజం బయట పడింది. ప్రైవేటు ఆసు పత్రులలో జరుగుతున్న గోల్మాల్‌లకు ఈ రమేష్ ఆసుపత్రి వారి బాగోతమే పెద్ద ఉదాహరణ. ఈ విషయంలో ప్రభుత్వమే ప్రత్యేకచొరవ చూపి ప్రైవేటు ఆసుపత్రు లలో సైతం ప్రభుత్వ పర్యవేక్షణలో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలి.

**ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.**

ఈ-మెయిల్

ప్రజావాణి

roopagroup@yahoo.com


లాయర్

పాఠకులకు మనవి

మా(మీ) లాయర్ పత్రికకు

**సమాచారం / లేఖలు**

పంపదలచిన వారు

**9866314741** నంబరుకు

వాట్సయాప్ ద్వారా గాని, లేదా

roopagroup@yahoo.comకి

ఈ-మెయిల్ ద్వారా గాని

పంపవలసిందిగా విజ్ఞప్తి.

పోస్టల్ చిరునామా :

ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,

మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.

- సం/-



## ప్రభుత్వ సిబ్బంది, అధికారుల అలసత్వం

కరోనా మహమ్మారి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తుంటే, ఆ మాయదారి జబ్బుకు మించిన నిర్లక్ష్య రోగం కొంత మంది అధికారులు, సిబ్బందిలో కనిపి స్తోంది. నూటికి 80 శాతం మంది ప్రభుత్వ డాక్టర్లు, నర్సులతో పాటు ఇతర హాస్పిటల్ సిబ్బంది కరోనా పేషంట్ల పట్ల కరుణ చూపిస్తూ వారికీ మనోధైర్యాన్ని కల్పిస్తుంటే మిగిలిన 20శాతం మంది రోగుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ తమ రాక్షసత్వాన్ని చూపిస్తున్నారు. కరోనా వచ్చినవారిని అక్కున చేర్చుకుని వైద్యం చెయ్యాలి, అరగంటలో వారికి ఆసు పత్రిలో బెడ్ ఇవ్వాలి అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిగారు అదేశించడమే కాకుండా ప్రతినిత్యం అధికారులతో సమీక్ష చేస్తున్నప్పటికీ అక్కడక్కడా, రోగు లను పట్టించుకోకపోవడం, వారి అను మానాలను సరిగ్గా నివృత్తి చెయ్యక పోవడం, పేషంట్ల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ఆసుపత్రి బయటే వారిని పడుకోబెట్టడం వంటి సంఘటనలు అడపా దడపా జరుగుతూనే వున్నాయి. ఇలాంటి నిర్లక్ష్య వ్యక్తుల వల్ల కష్టపడి పని చేస్తున్న 80శాతం మందికి కూడా చెడ్డపేరు వస్తోంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులు పట్టించుకోని ప్రభుత్వానికి, మిగిలిన 80శాతం మందికి చెడ్డపేరు తెస్తున్న ఇలాంటి వారిపై కఠినంగా చర్యలు తీసుకుని ఒకరిద్దరిని ఉద్యోగాలలో నుండి తొలగించేంత సీరియస్‌గా చర్యలు తీసు కుంటే తప్ప వీరిలో మార్పు వచ్చేలా కనిపించడం లేదు.

**కె.సురేష్‌బాబు, నెల్లూరు.**

## ప్రతి గ్రామానికీ కుళాయిలు..

# ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన జలధారలు



**దేశానికి వెన్నెముక పల్లెలే. పల్లెలు బాగుంటే దేశంలో ఎలాంటి కరువుండదు. ఆరుగాలం కష్టించి పనిచేసే అన్నదాతలు, అత్యధికశాతంమంది కష్టజీవులు ఉండేది పల్లెల్లోనే. అయితే, స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తూనే ఉన్నా అనేక ప్రాంతాల్లో నేటికీ గుక్క తడుపుకునేందుకు గుక్కెడు మంచినీరు కూడా దొరక్క విలవిలలాడే గ్రామాలెన్నో ఉన్నాయి. నిద్రమంచం లేచింది మొదలుకొని కుండా బిందె చేతపట్టి మంచినీళ్లెక్కడ దొరుకుతాయోనని ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎక్కడో దూరంగా ఉన్న పొలాల వెంబడి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దుస్థితి. ఎన్నాళ్ళని..ఎన్నేళ్ళని ఈ అవస్థ?... ఈ కష్టాలను పోగొట్టడానికి కేంద్రప్రభుత్వం సంకల్పించింది. ప్రతి గ్రామానికి తాగునీటికి కొదవలేకుండా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. పల్లె ప్రజలకు మంచినీటి కొరతను శాశ్వత ప్రాతిపదికపై నివారించడానికి సమాయత్తమైంది.**

- **ప్రజల నీటిబాధలు తీర్చేందుకు కేంద్రం కొత్త పథకం**
- **730.46 కోట్లతో 'జల్‌జీవన్ మిషన్' ప్రణాళిక సిద్ధం**
- **జిల్లాలో పెద్దఎత్తున అధికారుల ఏర్పాట్లు**

'జల్‌జీవన్ మిషన్' అనేది కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వినూత్నమైన కార్యక్రమం. జాతీయ తాగునీటి కార్యక్రమం అనే పథకానికి ఇది కొత్త రూపం. ఈ కార్యక్రమం ద్వారా మనజిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రతి ఒక్కరికీ రోజుకు కనీసం 55 లీటర్ల పరిశుభ్రమైన మంచి నీరు అందించడంతో పాటు ఇళ్లకు నేరుగా మంచినీరు సరఫరా అయ్యేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ఇది. దీంతో జిల్లాలోని గ్రామాల్లో ఇక మంచినీటికి దిగులు లేకుండా చేయాలన్నదే సంకల్పం. అందుకు జిల్లా కలెక్టర్ సారథ్యంలో జిల్లా అధికారయంత్రాంగం చకచకా అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

**మూడేళ్ళలోనే లక్ష్యసాధనకు నిర్ణయం :**

జిల్లాలో ఈ ఏడాది నుంచి నాలుగేళ్ళలో 5,70,025 హెచ్‌టిసి కనెక్షన్లు అందించాలన్నదే లక్ష్యం. ఇప్పటిదాకా 2,81,834 కుటుంబాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. వచ్చే ఏడాదిలో 1,23,167 కుటుంబాలకు, 2021–22లో 1,19,884 కుటుంబాలకు ఈ సరఫరాను పెంచనున్నారు. మొత్తంగా జిల్లాలో ప్రస్తుతం 49 శాతం కుటుంబాలకు నేరుగా ఇంటికే కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తుండగా, వచ్చేఏడాదికి 71శాతం, 2021–22లో 92 శాతానికి, 2022–23లో నూటికి నూరుశాతం చేరుకోవాలని, ఎవరూ మంచినీటికి ఇబ్బంది పడకూడదని ఈ కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. నిర్దేశించిన సమయానికన్నా ఏడాది ముందుగానే జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఇందు కోసం జిల్లాకు 730 కోట్లా 46 లక్షల రూపాయలతో వార్షిక ప్రణాళిక కూడా సిద్ధమైంది.

**జిల్లా జల్‌జీవన్ కమిషన్ ఏర్పాటు**

ఈ కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించేందుకు జిల్లా జల్‌జీవన్ కమిషన్ ఏర్పాటైంది. అన్ని గ్రామాల కార్యాచరణ ప్రణాళికలను క్రోడీకరించి జిల్లా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. జిల్లా జల్‌జీవన్ మిషన్ కమిటీకి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. ప్రతి కుళాయి కనెక్షన్‌ను ఆ కుటుంబ యజమాని ఆధార్‌సంఖ్యతో అనుసంధానం చేయడం, ఆ ఇంటిని జియో ట్యాగింగ్ చేయడం కూడా జరుగుతుంది. గ్రామాల్లో నీటి వివరాలు, నీటి వనరులు అన్నిటినీ గుర్తించి వాటి నుంచి ఆయా పల్లెలకు నీరందించేలా చేయడం, అవసరమైన పైపులైన్లు వేయడం వంటి చర్యలన్నీ క్రమబద్ధంగా తీసుకుంటారు. 50 శాతం కంటే ఎక్కువ జనాభా ఉండే గిరిజన, వెనుకబడిన, అటవీ ప్రాంతాలు, కొండ ప్రాంతాలలో నివసించేవారికి 5శాతం పెట్టుబడి నిధి అందించి, వీటి నిర్వహణ చేపట్టేలా చేసేందుకు శాశ్వత ప్రాతిపదికపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇవన్నీ పూర్తయితే, ఇక జిల్లాలోని ప్రతి పల్లెకు, ప్రతి వ్యక్తికి ఇక మంచినీటి కొరతే ఉండదని వేరే చెప్పనక్కర లేదు.

---

## నిమ్మ రైతుల కంట...

# కన్నీరే మిగులుతోంది

- **రోడ్లపాలవుతున్న టన్నుల కొద్దీ నిమ్మకాయలు**



**జిల్లాలో నిమ్మరైతుల దుస్థితి రోజురోజుకూ మరింత దయనీయంగా తయారవుతోంది. వారి పరిస్థితి అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఈ సీజన్‌లో నిమ్మకాయలకు మంచి ధరలు వస్తాయని ఇన్నాళ్లూ ఆశగా ఎదురుచూసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ఒకప్పుడు జాతీయమార్కెట్‌ను సైతం శాసించిన గూడూరు నిమ్మరైతులు కూడా ఇపుడు ఎన్నడూలేనంత దుస్థితిలో ఉన్నారు. గూడూరు, పొదలకూరు మార్కెట్‌లకు కొద్దిరోజులు సెలవు ప్రకటించి వేచిచూసినా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు నిరాశతో రోజూ టన్నులకొద్దీ నిమ్మకాయలను రోడ్లపై వదిలేసి వెళ్ళిపోతున్నారు. ఈ దయనీయ స్థితి నుంచి గట్టెక్కేదెప్పుడోనని నిమ్మరైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.**

జిల్లాలో నిమ్మకాయల పుట్టినిల్లుగా ఉన్న గూడూరు, పొదలకూరు మండలాల ప్రాంతాల్లో రైతులు ఇప్పుడు కడివెడు కన్నీళ్ళతో ఉన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోలేక అవస్థలు పడుతూనే ఉన్నారు. నిమ్మకాయల బస్తా ధర గత ఏడాది ఇదే సీజన్‌లో కనీసం 1500 రూపాయలకు పైగానే ఉంటే ఇప్పుడు కనీసం బస్తా 500 రూపాయలకు కూడా అమ్ముడుపోవడం లేదంటూ రైతులు పడే బాధ వర్ణనాతీతం. దీంతో ఇక చేసేదేమీ లేక అడిగినవారికి 200రూపాయలకు కూడా బస్తా నిమ్మకాయలను అమ్ముకోవాల్సి వస్తోంది. కోత కూలీలు, రవాణా ఖర్చులు, సాగు ఖర్చులు అన్నీ కలిసి తడిసిమోపెడైన నేటి పరిస్థితుల్లో కనీసం వెయ్యి రూపాయలైనా ధర లేకుండా రైతులకు గిట్టుబాటు ధర ఉండదు. కరోనా దెబ్బతో దేశంలోని ఉత్తరాది మార్కెట్లన్నీ మూతపడి ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో మార్కెట్లు నామమాత్రంగానే ఉన్నాయి. అదీకాక కేరళ తదితర ప్రాంతాల్లో వర్షాలు కుండపోతగా కురుస్తుండటంతో అక్కడికి రవాణా సౌకర్యాలు సరిగా లేక నిమ్మ ఎగుమతులు నిలిచిపోయాయి. నిమ్మ మార్కెట్‌కు ప్రసిద్ధిగాంచిన ఢిల్లీమార్కెట్ కూడా కుదేలైపోయింది. దీంతో జిల్లాలో పండించిన నిమ్మకాయలను విక్రయించుకునే మార్గాలు లేక, స్థానికంగా ఉన్న దుకాణాల్లో కొనేవారు లేక, కొన్నా అత్యంత తక్కువ ధరకు బేరమాడుతుండడంతో నిరాశకు గురైన రైతులు అనేకమంది చెట్లమీదనే కాయలు వదిలేస్తున్నారు. మరికొంతమంది రోడ్లమీదనే టన్నులకొద్దీ నిమ్మకాయలను పారవేస్తున్నారు. మార్కెట్‌లకు వస్తున్న నిమ్మకాయల్లో రోజూ కనీసం 20టన్నుల దాకా వృధాగా పారబోయాల్సివస్తోందని రైతులు, వ్యాపారులు ఆవేదనతో చెప్తున్నారు. గిట్టుబాటు ధరలు వస్తాయని చెట్ల నుంచి కోయకుండా ఉన్న నిమ్మకాయలు కూడా పండి నేలరాలిపోతున్నాయి. నాణ్యత లేని ఆ కాయలను ఏరుకునేందుకు కూడా ఎవరూ ప్రయత్నించడం లేదు. ఈ ఏడాది కరోనా ధాటికి తాము అష్టకష్టాలతో పాటు తీరని నష్టాల్లో మునిగిపోతున్నామంటూ రైతులు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ప్రభుత్వం వెంటనే ఈ దుస్థితిని గమనించి నిమ్మరైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

---

## బాపిరెడ్డికి బదిలీ..

# అనుకున్నట్లే అయింది

**నెల్లూరు కార్పొరేషన్‌కు ఏమి దురదృష్టమో కానీ ఒక్క కమిషనర్ కూడా కుదురుకోవడం లేదు. కనీసం ఏడాదైనా దాటకముందే కార్పొరేషన్ నుంచి నిష్క్రమిస్తున్నారు.**



నెల్లూరు కమిషనర్‌గా చురుగ్గా పనిచేస్తున్న టి.బాపిరెడ్డి కూడా ప్రస్తుతానికి సెలవులో ఉన్నా ఆయనకు బదిలీ తప్పదనే మాట సర్వత్రా వినిపించింది. ఇందుకు రాజకీయాలే కారణమై ఉంటాయని సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది. నెలరోజులుగా సెలవులో ఉన్న ఆయన ఈనెల 15న మళ్లీ విధుల్లోకి రావాల్సి ఉంది. అయితే అప్పటిలోగానే బదిలీ జరిగిపోతుందా లేక విధుల్లోకి వచ్చాక బదిలీ అవుతుందా అనుకుంటున్న సమయంలో అంతా అనుకున్నట్లే అయింది. బాపిరెడ్డిని ఇక్కడి నుంచి బదిలీ చేసి ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ (ఆసరా)గా నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 12న తాజా ఉత్తర్వులిచ్చింది. ఇక్కడ రాజకీయ వత్తిళ్ళు తట్టుకోలేక ఆయన ఇక్కడి నుంచి బదిలీ కావడమే ఉత్తమమని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటిదాకా మన నెల్లూరు కార్పొరేషన్‌లో అలీబాషా, పివివిఎస్ మూర్తి, ఆ తర్వాత బాపిరెడ్డి కమిషనర్లుగా చేరారు. ఒకరి తర్వాత ఒకరుగా బదిలీ బాట పట్టారు. కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఎఎస్ అధికారిని నియమించాల్సిందిగా కలెక్టర్ కూడా ప్రభుత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది. ఈ పదిహేను నెలల్లోనే నాలుగో కమిషనర్ ఇక్కడికి వస్తారని అందరూ చర్చించుకుంటున్నారు. ఆ వచ్చే కొత్త కమిషనరైనా ఈ రాజకీయాల దెబ్బకు ఎంతకాలం ఇక్కడ నిలబడగలడో ఆ దేవుడికే తెలియాలి.

---

# భూముల విలువలు పెరిగాయి

- **10శాతం దాకా పెరుగుదల**
- **కొత్తధరలు అమలులోకి వచ్చేశాయి**

**ఎంతోమంది భూ యజమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. ఎట్టకేలకు జిల్లాలో భూముల విలువలు పెరిగాయి. రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖలో ఈనెల 10 నుంచి అవి అమలులోకి వచ్చాయి. ఈ శాఖలు పెంచిన మార్కెట్ విలువలకు ఈనెల 9న జిల్లా మార్కెట్ విలువల పెంపుదల కమిటీ ఆమోదముద్ర వేయడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చినట్లయింది.**



భూములు, స్థలాల విలువలను నాలుగు విభాగాలు చేసి వాటికి 10శాతం వరకు విలువలు పెంచారు. మొదటి విభాగంలో అర్బన్ ప్రాంతాల్లో ఉన్న ఇళ్ళ సముదాయాలు, రెండవ విభాగంలో వ్యాపార సముదాయాలు, మూడవ విభాగంలో శివారు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూములు, నాల్గవ విభాగంలో జాతీయరహదారి పక్కనున్న భూములు ఉన్నాయి. ఇదే సందర్భంలో అపార్టుమెంట్లకు సంబంధించి చదరపు అడుగు నిర్మాణ ప్రాంతానికి నిర్ణయించిన ధరతో పాటు వాటికి సంబంధించిన స్థలం విలువను కూడా కలిపారు. అపార్టుమెంట్ల విలువ పెరిగినందువల్ల ఈ కాంపోజిట్ విలువ కూడా పెరుగుతుంది. వీటి విలువలు పెంచడం వల్ల ప్రభుత్వానికి కూడా ఆదాయం బాగా పెరుగుతుందని భావిస్తున్నారు. నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో నివాసప్రాంతాల్లో చదరపు గజం విలువ 17,500 రూపాయలు ఉండగా కొత్త ధరలతో అది 18,500కు, పొలాల విషయంలో ఎకరాకు సుమారు లక్ష రూపాయల దాకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

పెంచిన విలువల వివరాలన్నిటినీ రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో కూడా పొందుపరిచారు.

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో

# కోవిడ్ నిబంధనలు పాటించాలి

**జిల్లా అధికారులతో డిఆర్‌ఓ సమీక్ష**



ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించే సందర్భంలో అందరూ కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించి, భౌతికదూరం పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జున జిల్లా అధికారులకు సూచించారు. ఈనెల10న నెల్లూరు నగరంలోని డిఆర్‌ఓ చాంబర్‌లో ఆయన అధికారులతో సమావేశమై 74వ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల గురించి సమీక్షించి పలు ఆదేశాలను జారీచేశారని చెప్పారు. డివిజన్, మండల స్థాయిల్లో అధికారులు వారి కార్యాలయాల్లో ఉదయం 9గంటలలోపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నిర్వహించాలని స్పష్టం చేశారు. నెల్లూరు పోలీస్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో ఆగస్టు 15వ తేది ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు. పదేళ్ళ లోపు చిన్నారులు, 60 ఏళ్ళ పైబడిన వృద్ధులు ఈ వేడుకలకు హాజరుకాకుండా చూడాలన్నారు. నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ లెక్చరర్లకు న్యాయం చేయండి

**- విఎస్‌యు రిజిస్ట్రార్‌కు వినతి**

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించి తమకు తగు న్యాయం చేయాలంటూ విఎస్‌యు ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు బివి సుబ్బారెడ్డి కోరారు. ఈనెల10న వారు తమ సమస్యల పరిష్కారం కోసం విఎస్‌యు ఎదుట ఆందోళన చేపట్టారు. జిఓ నెంబర్ 24ను ఒప్పంద అధ్యాపకులకు అమలుచేయకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రమేష్, శంకర్, కామేశ్వరరావు, గోవిందు, నిరంజన్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఈనెల 11న వేడుకలు జరిగాయి. కృష్ణమందిరాల్లో ప్రత్యేకపూజలు, ఇంటింటా చిన్నారుల చిన్నికృష్ణుని వేషధారణలతో, వేడుకలు జరిగాయి. నెల్లూరు నగరంలోని మహాత్మా గాంధీనగర్ భక్తవత్సలనగర్, పడారుపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న శ్రీకృష్ణ మందిరాల్లో స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు చేసి విశిష్టపూజలు చేశారు. బాలాజీనగర్ మెయిన్‌రోడ్డులో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించి ఉట్టి మహోత్సవం జరుపుకున్నారు. నెల్లూరు ఇస్కాన్ మందిరంలో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణభగవానునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అనేకమంది చిన్నారులు శ్రీకృష్ణ వేషధారణలతో ఇస్కాన్ మందిరానికి వచ్చి అందరినీ అలరించారు.

# గిరిజన బాలలకు విద్యా కిట్‌లు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న నెల్లూరులోని దీనదయాళ్‌నగర్, వైకుంఠపురంలలోని గిరిజన బాలలకు ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పులి చెంచయ్య ఆధ్వర్యంలో విద్యా కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన బాలల అభ్యున్నతికి ఈ విద్యా కిట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. గిరిజన బాలలంతా చదువుపై ఆసక్తి చూపి ఉత్తమ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహేష్, శశి, ప్రసాద్, మధు, రవిప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### పెద్దాసుపత్రిలో ప్రతివార్డులో

# సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలి

**జిజిహెచ్ సూపరింటెండెంట్‌కు కలెక్టర్ ఆదేశం**



నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాసుపత్రిలో ప్రతి వార్డులో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటిని జిల్లా ఎమర్జెన్సీ ఆపరేటింగ్ సెంటర్‌కు అనుసంధానం చేసే ఏర్పాట్లన్నీ త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. ఈనెల11న కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో సుధాకర్ రెడ్డితో మాట్లాడుతూ తమను డాక్టర్లు చూడలేదని రోగుల నుంచి ఫిర్యాదు రాకుండా ప్రతి వార్డులో రోగులకు వైద్యసేవలు అందించేలా చూడాలని స్పష్టం చేశారు. నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో 500 బెడ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అక్కడ ఇప్పటికే ఏర్పాటు చేసిన ఓపి సేవలు క్రమబద్ధంగా ఉండాలని, అవసరమైన వైద్యులను, సిబ్బందిని వెంటనే నియమించాలని ఆదేశించారు.

**అందరికీ పరిశుభ్రమైన మంచినీళ్ళు అందించాలి**

జిల్లాలో ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీళ్ళు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు గ్రామీణ నీటిసరఫరా అధికారులను ఆదేశించారు. ఈనెల 10న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో తన అధ్యక్షతన జరిగిన జలజీవన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీళ్ళ సరఫరాతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. రానున్న మూడేళ్లలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇందుకోసం 750కోట్ల రూపాయలు వెచ్చించడం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాసకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, స్త్రీ శిశుసంక్షేమశాఖ పి.డి సుధాభారతి, ట్రాన్స్‌కో ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి జేడీ శివన్నారాయణ పాల్గొన్నారు.

# స్మశానవాటిక అభివృద్ధికి కృషిచేస్తా

**- కొత్త ఛైర్మెన్ ప్రతాప్‌రెడ్డి**

నెల్లూరు రోటరీ క్లబ్ స్మశానవాటిక అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని స్మశానవాటిక నిర్వహణ కమిటీకి కొత్త ఛైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చంద్రారెడ్డి విద్యాసంస్థల అధినేత కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈనెల 9న నగరంలోని రోటరీక్లబ్ ఆడిటోరియంలో ఈ కమిటీని నియమించారు. నూతన ఛైర్మెన్‌గా ప్రతాప్‌రెడ్డితో పాటు, వైస్ ఛైర్మెన్‌గా శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీగా మధుసూదన్‌రావు, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 2005వ సంవత్సరంలో సుమారు 80 లక్షల రూపాయలు వ్యయం చేసి రోటరీక్లబ్ స్మశానవాటిక నిర్మాణం జరిగిందని, 2014లో మరో 60లక్షల రూపాయలు వెచ్చించి స్మశానవాటికలో అవసరమైన అదనపు నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. ఛైర్మెన్‌గా ఎన్నికైన ప్రతాప్‌రెడ్డిని రోటరీక్లబ్ సభ్యులంతా అభినందించారు.

# మా సమస్యలు తీర్చండి సారూ!..

**- జూనియర్ డాక్టర్ల ఆందోళన**

ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద జూనియర్ డాక్టర్లు ఈనెల9న కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ తనూజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యుల కొరతతో పనిభారం పెరుగుతోందని, ఇప్పటికే పలువురు వైద్యులు కూడా కోవిడ్ వైరస్ బారినపడ్డారని, వెంటనే వైద్యుల నియామకం చేపట్టాలని కోరారు. ఈ కరోనా సమయంలో కొందరు బాధితులు తమపై దాడులు చేస్తున్నారని, అలా జరగకుండా జిల్లా అధికారులు రక్షణ కల్పించాలన్నారు. తమకు నాణ్యమైన పిపిఇ కిట్‌లు, ఎన్-95 మాస్కులు అందజేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 50 లక్షల ఇన్సురెన్సు సదుపాయాన్ని తమకు వర్తింపజేయాలని, జిఓ నెంబరు 287 ప్రకారం తమ వేతనాలు పెంచాలని విజ్ఞప్తిచేశారు.

### గిరిజన యువత కోసం..

# నైపుణ్యాభివృద్ధి కోర్సులు

జిల్లాలో ఐటిడిఏ ద్వారా గిరిజన యువత కోసం నైపుణ్యాభివృద్ధి కోర్సులు నిర్వహిస్తున్నామని, ఆ కోర్సులను వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.వినోద్‌కుమార్ చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న నెల్లూరులోని బివి నగర్‌లో ఉన్న గిరిజన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు స్వతహాగా మృదుస్వభావులని, మంచి మనస్తత్వం కలిగిన వారని అంటూ గిరిజనుల అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు లేని గిరిజనులను గుర్తించి వెంటనే వాటిని వారికి అందజేసేలా చూస్తామన్నారు. అనంతరం ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి పథకం ద్వారా ఎంపికైన ఇద్దరికి 10.60 లక్షల విలువైన రెండు బొలెరో వాహనాలను ఆయన ఈ సందర్భంగా అందజేశారు. ఐటిడిఏ పి.ఓ మణికుమార్, గిరిజన సంక్షేమాధికారిణి విద్యారాణి, గిరిజన నాయకులు కెసి పెంచలయ్య, పులి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య సంగ్రామంలో..

# క్విట్ ఇండియా ఉద్యమం మరువలేనిది




భారత స్వాతంత్ర్య సంగ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీజీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం ఏనాటికీ మరువలేనిదని, ఆ ఉద్యమం ప్రారంభమైన ఆగస్టు 9వ తేది ఎంతో చరిత్రాత్మకమైనదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ ఆగస్టు 9న నెల్లూరులోని గాంధీవిగ్రహానికి వారు పూలమాలలు వేసి గాంధీజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మాగాంధీ అహింసా ఉద్యమాన్ని ప్రపంచానికి తెలియజేసింది క్విట్ ఇండియా ఉద్యమమేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌బాబు, సేవాదల్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సవరణ బిల్లుతో అందరికీ ఇబ్బందులు

విద్యుత్ సంస్థల్లో ప్రవేశపెట్టనున్న 2020 విద్యుత్ సవరణ బిల్లుతో ఉద్యోగులకు, వినియోగదారులకు అందరికీ ఇబ్బందులు ఎదురౌతాయని, అందువల్ల ఆ బిల్లును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలంటూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని విద్యుత్‌భవన్ ఎదుట వారు ఈనెల 9న 'సేవ్ వర్కర్స్-సేవ్ ఇండియా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు దుగ్గిరాల హరిబాబు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇపిఎఫ్‌ను రద్దు చేసి జిపిఎఫ్‌ను అమలుచేయాలని, ఉద్యోగులందరికీ పింఛన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా జాతిపిత మహాత్మాగాంధీజీ ఆగస్టు 9న క్విట్ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చారని, అదే స్ఫూర్తితో తాము 'సేవ్ వర్కర్స్-సేవ్ ఇండియా' కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగయ్య, జయశంకర్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# ఆదూరు కృష్ణయ్య




మూలస్థానేశ్వరస్వామి దేవాలయ కమిటీ కార్యవర్గ సభ్యుడు, నెల్లూరు క్లబ్ కోశాధికారి, ఐటిసి డిస్ట్రిబ్యూటర్ బుచ్చిరెడ్డిపాళెం వాసి 'చందు'గా పిలవబడే ఆదూరు పూర్ణచంద్రరావు తండ్రి ఆదూరు కృష్ణయ్య(75) ఇటీవల మృతి చెందారు. బుచ్చిరెడ్డిపాళెం పరిసర ప్రాంతాల్లో ఈయన స్థాపించిన రవి మెడికల్ హాలా పేరెన్నికగలిగింది. 'రవి' మెడికల్ కృష్ణయ్యగా ఎంతోమందికి పరిచయం ఉన్న వ్యక్తి ఈయన. నిరాడంబరమైన జీవనశైలి ఆయనది. అందరినీ నవ్వుతూ పలకరించే ఆప్యాయతతో అందరి అభిమానాన్ని చూరగొన్న వ్యక్తి కిష్టయ్య. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారి కుటుంబసభ్యులకు 'లాయర్' ప్రగాఢ సానుభూతి.

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు..

# తెలంగాణ అడ్డుతగలడం తగదు

శ్రీశైలం వరదనీటిని వినియోగించుకునేందుకు పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సామర్థ్యం పెంచుతామంటే తెలంగాణ ప్రభుత్వంతో పాటు అన్ని పార్టీలు రాద్ధాంతం చేయడం ఏమిటని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. సముద్రంలో వృధాగా కలిసిపోయే వరదనీటిని ఉపయోగించుకుంటామంటే అడ్డుపడడం తగదని, ఏపిలో రాయలసీమ అత్యంత వెనుకబడిన ప్రాంతమని, దేశంలో అత్యంత తక్కువ వర్షపాతం కలిగిన జిల్లాల్లో అనంతపురం ఒకటని ఆయన అంటూ, ఇప్పటికే అందుబాటులో ఉన్న పట్టి సీమ, రాబోయే పోలవరంతో పాటు తెలంగాణాలో నిర్మించిన పలు ప్రాజెక్టులతో శ్రీశైలంలో మిగులు జలాలు ఉన్నాయని, ఆ నీటిని రాయలసీమలో వాడుకుంటామంటే అడ్డుకోవడం భావ్యం కాదన్నాడు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఎన్టీఆర్ సృష్టి అని, హంద్రీనీవా, గాలేరు నగరి, బ్రహ్మసాగరం, తెలుగుగంగ, సోమశిల, కండలేరు తదితర ప్రాజెక్టులన్నీ ఎన్టీఆర్ ఆలోచనకు ప్రతిరూపాలేనని, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును తొలుత ఎన్టీఆర్ 14వేల క్యూసెక్కుల సామర్థ్యంతో చేపడితే, వైఎస్సార్ దానిని 44వేల క్యూసెక్కులకు పెంచారని, తెలంగాణ సిఎం కేసీఆర్ ఏడాది క్రితం రాయలసీమకు వచ్చినప్పుడు ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత తనదేనని స్పష్టంగా ప్రకటించారని, ఇప్పుడేమో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును అడ్డుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఆంధ్రా వాళ్లమైనా, తెలంగాణ ప్రజలైనా అందరం అన్నదమ్ముల్లా కలిసి వుంటామని, ఒకరి మంచి మరొకరం కోరుకుంటామని ఆయన పేర్కొంటూ అత్యంత దుర్భిక్ష ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందిస్తుంటే సంతోషించాల్సిందిపోయి ఆక్షేపించడం దురదృష్టకరమన్నాడు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఏడాదిన్నర కాలంగా పాత ప్రాజెక్టులన్నిటినీ పడుకోబెట్టేసిందని, టిడిపి ప్రభుత్వం చేపట్టిన అనేక ప్రాజెక్టులు పూర్తై ఉంటే.. భారీగా ఆయకట్టు సాగులోకి వచ్చి ఉండేదని, ఈరోజు ఈ పరిస్థితి ఉండేది కాదని ఆయన వివరించాడు.



- మాజీమంత్రి సోమిరెడ్డి



## మంత్రి గౌతంరెడ్డిని కలిసిన కలెక్టర్

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డిని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల11న నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో గౌరవపూర్వకంగా కలుసుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును, కరోనా నియంత్రణకు చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై వారు చర్చించుకున్నారు.

## అధికారులకు మేకపాటి శానిటైజర్లు



కరోనా వ్యాధి వ్యాపిస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఈ వ్యాధి నియంత్రణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిత్యం అనేక చర్యలు చేపడుతున్నారని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 11న ఆయన ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహశీల్దార్లకు, ఎంపిడిఓలకు తన సొంత నిధులతో సమకూర్చిన అయిదు లీటర్ల శానిటైజర్ల క్యాన్లను నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కరోనా ప్రస్తుతం గ్రామాలకు కూడా వ్యాపించిందని, అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలకు ఆ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తల పట్ల అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. వింజమూరులో కూడా కోవిడ్ పాజిటివ్ కేసులు అధికమవుతున్నాయని, అధికారులు కరోనా నివారణకు ఎప్పటికప్పుడు కృషిచేస్తుండాలని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.

## విఎస్‌యులో.. జర్నలిజం కోర్సుకు ఫీజు రాయితీ



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సులో చేరాలనుకునే వర్కింగ్ జర్నలిస్టులకు ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 40 శాతం ఫీజు రాయితీ చెల్లించడానికి ముందుకు వచ్చిందని యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా.ఎల్‌వి కృష్ణారెడ్డి తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై మూడేళ్ళపాటు జర్నలిస్టులుగా అనుభవం ఉన్నవారు ఈ రాయితీ పొందేందుకు అర్హులని, ఆసక్తి ఉన్న జర్నలిస్టులు యూనివర్శిటీలో అడ్మిషన్ల కోసం www.vsudoa.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ ఉత్తీర్ణులైనవారు పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజంలో అడ్మిషన్ తీసుకోవచ్చని, ఫీజు రాయితీ పొందదలచిన జర్నలిస్టులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసి ప్రింట్ తీసుకుని ఫీజు రాయితీ కోరుతూ లేఖ రాసి దరఖాస్తు ప్రతిని జతచేసి ప్రెస్ అకాడమీ కార్యదర్శికి పంపాలని పేర్కొన్నారు. జర్నలిస్టుగా ఉన్న అనుభవాన్ని ధృవీకరించే పత్రాలు కూడా జతచేసి పంపాలన్నారు. జిల్లాలోని జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 18వ తేది లోగా దరఖాస్తు చేయాలని, ఈ కోర్సులో చేరేందుకు ఎలాంటి ప్రవేశపరీక్ష రాయనవసరం లేదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం మాత్రం తప్పనిసరి అని వివరించారు. తాము ప్రతిపాదించగానే జర్నలిస్టులకు ఫీజు రాయితీ కల్పించడానికి అంగీకరించిన ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డికి యూనివర్శిటీ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ డా.ఎల్వీకి ధన్యవాదాలు తెలియజేశారు.




# వ్యాపారం కుదేలు.. వ్యాపారుల దిగాలు

## కూరగాయల వ్యాపారానికి.. కరోనా దెబ్బ



**కరోనా నానాటికీ విజృంభిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూనే ఉంది. చెన్నై కోయంబేడు మార్కెట్‌లో కరోనా వ్యాప్తి పెరిగిన నేపథ్యంలో అక్కడినుంచి ఇక్కడికి కూరగాయలు తెచ్చే వ్యాపారులకు, వాటిని కొనే వినియోగదారులకు ఆ ప్రభావంతో కోవిడ్ వైరస్ సోకకుండా ముందుజాగ్రత్త చర్యలు తప్పనిసరి అయ్యాయి. మార్కెట్ల వద్ద గుంపులుగా తిరగడం వల్ల కరోనా వ్యాప్తికి అవకాశం ఉంది కనుక ప్రజలు తమ ఇళ్లకు సమీప ప్రాంతాల్లో ఉండే దుకాణాల నుంచే కూరగాయలు వగైరాలు కొనుక్కుంటున్నారు. దీంతో నగరంలోని ప్రధానమైన మార్కెట్లు, దుకాణాల్లో వ్యాపారాలు బాగా తగ్గిపోవడంతో, ఈ మాయదారి కరోనా తమ వ్యాపారాలను ముంచేసిందంటూ వ్యాపారులు గోడుగోడుమంటున్నారు.**

నెల్లూరు నగరంలో కరోనా వైరస్ నానాటికీ ప్రబలుతుండడంతో అధికారులు వ్యాధినిరోధానికి పెద్దఎత్తున అనేక జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నారు. ప్రజలు కూడా అత్యధికశాతం మంది అత్యవసరమైతే తప్ప ఇళ్ళలోంచి బయటకు వెళ్ళకుండా నిబంధనలు పాటిస్తూ కరోనా వ్యాధికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తమ ఇళ్ళకు ఎక్కడో దూరంగా ఉన్న మార్కెట్‌ల వద్దకు వెళ్ళడం దాదాపుగా మానుకున్నారు. దీంతో నగరంలోని ప్రధానమైన కూరగాయల మార్కెట్లు, దుకాణాల్లో వ్యాపారాలు జరక్క బోసిపోతున్నాయి. కరోనాను అరికట్టే చర్యల్లో భాగంగా నిత్యం వేలాదిమంది ప్రజలు వచ్చి కూరగాయలు కొనుక్కునే ఏసి కూరగాయాల మార్కెట్‌ను వేణుగోపాలస్వామి కళాశాల ఆవరణంలోకి తరలించారు. ఇది అత్యవసరం కూడా. అయితే దీనివల్ల కూరగాయల వ్యాపారం బాగా తగ్గిపోవడంతో వ్యాపారులు దిగాలుపడిపోయారు. కరోనా దెబ్బతో ఇంత దూరం వినియోగదారులు రాలేకపోతుండడం వల్ల వ్యాపారాలు జరగడం లేదని, దీంతో తాము అనేక కష్టనష్టాల పాలవుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. నగరంలోని ప్రజలే కాక, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చేవారు కూడా అందుబాటులో ఉన్న ఏసి కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు కొనుక్కొని తీసుకువెళ్ళడం అలవాటు. చిన్న చిన్న దుకాణాల వారు కూడా ఇక్కడి నుంచే కూరగాయలు కొనుగోలుచేసుకుని తిరిగి వాటిని అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతుండేవారు. జిల్లాలోని పలు గ్రామాల రైతులు తాము పండించిన ఆకుకూరలు, కాయగూరలు అన్నీ ఈ మార్కెట్‌కే తెచ్చి అమ్ముకునేవారు. అంతేకాక విజయవాడ, బెంగుళూరు తదితర దూరప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి రోజూ కూరగాయలు వస్తుండేవి. కనీసం అయిదారు వందల మంది దాకా కూరగాయల వ్యాపారులకు ఇక్కడ వ్యాపారం జరుగుతుండేది. రోజూ కనీసం పాతిక లక్షల రూపాయలకు పైగానే ఈ మార్కెట్‌లో వ్యాపారం జరుగుతుండేదని అంచనా. ఇప్పుడు ఆ పరిస్థితి అంతా తారుమారైపోయింది. కరోనా దెబ్బతో అంతా అస్తవ్యస్తమైపోయిందని వారు గగ్గోలు పెడుతున్నారు.

### అందరికీ అవస్థలే :

తాత్కాలికంగా ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలకు తలుపులు లేక పైనా కింద పట్టలు కట్టి దుకాణాలు ఏర్పాటుచేయడంతో వాటికి భద్రత లేక, తెచ్చుకున్న కూరగాయలను పక్కరోజుకు కూడా నిల్వ చేసుకోవడం అవస్థగా ఉంటోందని, ఎప్పటికప్పుడు రోజూ కూరగాయలు తెచ్చి అమ్ముకోవాలంటే ఎంతో కష్టంగా ఉందని, అంతేకాక వానొస్తే అంతా బురదమయంగా మారి వినియోగదారులు ఇక్కడికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. మార్కెటింగ్‌శాఖ వారు హైవే సమీపంలో పట్టలు కట్టి ఏర్పాటుచేసిన కూరగాయల దుకాణాలు అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో అంతంత దూరం వెళ్ళలేక ఎంతోమంది వినియోగదారులు తాజా కూరగాయల కోసం ఇబ్బందులు పడుతున్నారు. కరోనా దెబ్బతో బయటకు వెళ్ళలేక, తప్పనిసరై తమకు దగ్గర్లో ఉన్న దుకాణాలకు మాత్రమే వెళ్ళాల్సిన పరిస్థితి కావడంతో ఇదే అదనుగా ఆయా దుకాణాల్లో ఎంత ధర చెప్పినా కొనుక్కోవాల్సిందే తప్ప మరో గత్యంతరం ఉండడం లేదని మరోవైపు వినియోగదారులు కూడా లబోదిబోమంటున్నారు. మార్కెట్లు అందుబాటులో లేకపోవడంతో అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు అందరికీ అవస్థగానే ఉంటోంది. జిల్లా ఉన్నతాధికారులు ఈ కష్టనష్టాలన్నిటినీ మరోసారి పరిశీలించి అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా అధికారులు, వ్యాపారులు, నాయకులు అందరూ కలసి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కూరగాయల మార్కెట్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి, అక్కడ కోవిడ్ నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా నగరంలోని అనేకప్రాంతాల్లో కూరగాయల దుకాణాల వద్ద ప్రజలు గుంపులుగా తిరగకుండా మరింత పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ట్రూనాట్ ల్యాబ్‌కు పేర్నాటి చేయూత




కోవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల కోసం గూడూరు ఏరియా ఆసుపత్రిలో ట్రూనాట్ ల్యాబ్‌ను నూతనంగా ఏర్పాటు చేసేందుకు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పరికరాలు అందించాలని సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కోరడంతో సుమారు 3లక్షల రూపాయలతో 43ఇంచ్ ఎల్ఇడి టివీలు 2, ఒక 1.5 టన్ ఎయిర్ కండిషనర్, ఒక రిఫ్రిజిరేటర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫ్యాన్లు, లైట్లు, వైరింగ్ పరికరాలు, వాటిని బిగించేందుకు అయ్యే ఖర్చులు, ఆసుపత్రిలో తాగునీటి కోసం అవసరమైన పైపులు, ట్యాంక్, ఆసుపత్రిలో డేటాని భద్ర పరిచేందుకు అవసరమైన కొత్త కంప్యూటర్, ఒక ప్రింటర్, టేబుల్, కుర్చీలు, స్టూల్స్, ఒక మోడెమ్‌ను ఆసుపత్రికి అందజేయడం జరిగిందని పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపాడు. జిల్లా ఎస్పీ కోరిక మేరకు త్వరలోనే సుమారు 1800 మంది పోలీసులకు చేయూతనందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపాడు. పేర్నాటి దాతృత్వానికి సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశాడు. గూడూరు అర్బన్ సి.ఐ దశరథరామారావు, సాయిరెడ్డి, సుధీర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు



ఈ నెల 12వ తేదీ విజయవాడలోని డిజిపి ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో డిజిపి డి.గౌతమ్‌సవాంగ్ చేతుల మీదుగా (ఏబిసిడి) బెస్ట్ క్రైమ్ డిటెక్షన్ రివార్డును అందుకుంటున్న గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వరరాజు, కానిస్టేబుల్ పి.ఆదినారాయణ.

# హరిచంద్రారెడ్డి సేవలు అమూల్యం

**- సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత, దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త కనుమూరు హరిచంద్రారెడ్డి గూడూరు ప్రజలకు అందజేస్తున్న సేవలు అమూల్యమైనవని గూడూరు సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అభినందించాడు. కరోనా, లాక్‌డౌన్ నేపథ్యంలో బాధితులకు హరిచంద్రారెడ్డి తనవంతు సాయం అందించారని, అదే విధంగా కోవిడ్ బాధితులకు దాతలు అందరూ తమవంతు సాయం అందించాలని కోరాడు. గూడూరు సమీపంలోని టిడ్కో గృహసముదాయంలో క్వారంటైన్ కేంద్రాన్ని ఏర్పాటుచేయగా అక్కడ మౌలికవసతుల కల్పనకు తాను కోరిన వెంటనే హరిచంద్రారెడ్డి రెండురోజుల్లోనే సుమారు లక్ష రూపాయల విలువైన సామగ్రిని అందించారన్నాడు. హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ కోవిడ్ వైరస్‌తో ఎవరూ మృతిచెందకూడదని, దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే వారి అంతిమయాత్రకు ఎలాంటి ఆటంకం ఉండకూడదనే ఉద్దేశంతో అంతిమయాత్ర వాహనాన్ని తహశీల్దార్‌కు అందజేశామన్నాడు. పొన్నలూరు కోటారెడ్డి, సిఆర్‌రావు, జివిస్ రాయలు, అల్లారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, అల్లూరి ఆదిశేషారెడ్డి, సిఆర్‌రెడ్డి కుటుంబాలవారి దాతృత్వాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, వారు గూడూరు పట్టణ ప్రజలకు అందించిన సేవలను ప్రస్తుతించాడు. ఈ తరంలో తాను, తనతోపాటు మరెందరో సమాజసేవకు కృషిచేస్తున్నారన్నాడు. ప్రభుత్వాధికారుల సూచనలు పాటించి కరోనా నివారణకు అందరూ సహకరించాలన్నాడు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి చిరువెళ్ళ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జెవివి ఆధ్వర్యంలో..

# గర్భిణీ స్త్రీలకు భోజనాలు



గూడూరులోని జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఈనెల 10న ప్రభుత్వాసుపత్రిలో ఉన్న గర్భిణీస్త్రీలకు భోజన సదుపాయం ఏర్పాటుచేశారు. దాత, సూర్య ఫ్యాన్సీ అధినేత ఒగ్గు వేణుగోపాల్ దాతృత్వంతో డాక్టర్ ఉమ, డాక్టర్ చంద్రహాస్ చేతుల మీదుగా వారికి భోజనం ప్యాకెట్లు అందజేశారు. కరోనా నేపథ్యంలో గర్భిణులందరూ ప్రతి నెలా రక్తపరీక్షలు చేయించుకోవడం, మాస్కులు ధరించడం, తరచూ చేతులు శుభ్రపరచుకోవడం వంటి ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జెవివి సభ్యుల సేవలను డాక్టర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు వేణుగోపాల్‌తో పాటు వేగూరు రాజేంద్రప్రసాద్, మనోహర్, భాస్కర్, డాక్టర్ కీర్తి, గోపి, వరప్రసాద్, శ్రీను, దాసు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో

# మయూరి శ్యాం సేవలు



గూడూరులో కోవిడ్-19 కరోనా వైరస్ కారణంగా లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుండి ఈరోజు వరకు ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ సేవాసమితి సంస్థ ఫౌండర్ అధ్యక్షులు, గుంతకల్ రైల్వే డివిజన్ మాజీ డిఆర్‌యుసిసి మెంబర్, అంతర్జాతీయ మానవ హక్కుల మరియు నేర వ్యతిరేక సేవాసంస్థ రాష్ట్ర కార్యదర్శి, రొటేరియన్ బండి శ్యాంసుందరరావు(మయూరి శ్యాంయాదవ్) తెలిపాడు. 'లాయర్'తో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 30కు పైగా కార్యక్రమాలతో పేదలను ఆదుకున్నామని, చిట్టమూరు మండలంలో అరవపాలెంలో ఉన్న 12 గిరిజన కుటుంబాలకు నెలకు సరిపడా పల సరుకులు, కూరగాయలు, గూడూరు గమళ్ళపాలెంలో ఉన్న ఓం సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమం వృద్ధులకు ప్రతి నెలా ఒకరోజు అన్నదానం, గూడూరు రైల్వేస్టేషన్‌లో దాదాపు 50 మంది నిరాశ్రయులకు అన్నదానం, చవటపాలెంలో ఉన్న వృద్ధ దివ్యాంగ బ్రాహ్మణ కుటుంబాలకు ప్రతి నెలా సరిపడా పలసరుకులు, కూరగాయలు ఇవ్వడం జరిగిందని తెలిపాడు. గూడూరు పట్టణంలోని అదవికాలనీలో ఉన్న 30మంది అనాథపిల్లలకు, వృద్ధులకు శరణార్థులకు శర్నార్థుల ఆశ్రమంలో మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదానం చేయడం జరిగిందని, తహశీల్దార్ లీలారాణి సూచనమేరకు వలస కార్మికులకు ఆహారం, మంచినీరు అందజేయడం జరిగిందని, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు సూచన మేరకు 100 కుటుంబాలకు కూరగాయలు అందజేశామని, ఇవేగాక గూడూరు పట్టణంలోని 19, 22 వార్డుల్లో 70 కుటుంబాలకు 10రోజులకు సరిపడా కూరగాయలు కమిషనర్ చేతులమీదుగా ఇవ్వడం జరిగిందని తెలిపాడు.

అలాగే ఏపి అబ్దుల్ కలాం చారిటీస్, శ్రీకృష్ణ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా పేదలకు చక్కెరను అందజేశామని, 45 గిరిజన కుటుంబాలకు పౌష్టికాహారంగా కోడిగుడ్లు, ఊరగాయలు, పప్పుచెక్కలు, 300 రొట్టెలను తహశీల్దార్ చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపాడు. ప్రగతి సేవాసంస్థ, శ్రీకృష్ణ సేవా సమితి సంయుక్తంగా 19వ వార్డులో 10రోజులకు సరిపడా కూరగాయలు అందజేశామని తెలిపాడు. ఈ లాక్‌డౌన్ సందర్భంలోనే కాకుండా 2009 నుండి కూడా శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు సేవలందిస్తున్నామని, 2013-14లో గూడూరు మెయిన్ రోటరీ క్లబ్ అధ్యక్షునిగా ప్రజలకు సేవ చేశానని, ఇంకా చేస్తానని మయూరి స్వీట్స్, వనజాకృష్ణ కళ్యాణ మండపం అధినేత మయూరి శ్యాంయాదవ్ తెలిపాడు.

# హోంగార్డులూ.. కరోనాతో జాగ్రత్త!

**- ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు**




కోవిడ్-19 పట్ల హోంగార్డులందరూ అప్రమత్తంగా ఉండాలని ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు కోరాడు. సోమవారం గూడూరు పట్టణ సర్కిల్, రూరల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న హోంగార్డులకు కోవిడ్-19 పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పోలీసులు హోంగార్డుల సంక్షేమం కోసం జిల్లా ఎస్పీ అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఈ నేపథ్యంలో హోంగార్డులు నిర్వహించే విధుల్లో తప్పనిసరిగా కరోనా వైరస్ జాగ్రత్తలు పాటించి ఆ వైరస్ బారిన పడకుండా సురక్షితంగా ఉండాలని ఆయన సూచించాడు. గూడూరు పట్టణ సి.ఐ జి.దశరథరామారావు అధ్యక్షత వహించాడు. ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, విధిగా మాస్కులు ధరించాలని, చేతులు తరచూ శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని సూచించాడు. గ్రామీణ ఎస్సై పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

### కాలధర్మం

# మునగాల రఘురామిరెడ్డి



డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాంలో సబ్‌డివిజనల్ ఇంజినీరుగా సుదీర్ఘకాలం పనిచేసి రిటైర్ అయిన మునగాల రఘురామిరెడ్డి ఆగస్టు 8వ తేది ఉదయం గుండెపోటుతో పరమపదించాడు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. రఘురామిరెడ్డికి భార్య కృష్ణవేణమ్మ, కుమారులు రాజశేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి వున్నారు.

1948 ఫిబ్రవరి 14న జన్మించిన రఘురామిరెడ్డి స్వగ్రామం కలిగిరి. మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేసిన అనంతరం ఆయన టెలికాం శాఖలో చిరుద్యోగిగా చేరాడు, నీతి నిజాయతి, క్రమశిక్షణలే కొలమానాలుగా, తన ప్రతిభా నైపుణ్యాలతో అంచెలంచెలుగా ఎదిగి సబ్‌డివిజనల్ ఇంజనీరయ్యాడు. రఘురామిరెడ్డి చాలామందికి మార్గదర్శకంగా ఉండేవాడు, డిపార్టుమెంటులో తన సహోద్యోగులందరికీ ఆయన అత్యంత ప్రీతిపాత్రుడు. స్థాయి, హోదాలతో సంబంధం లేకుండా తన క్రింద పనిచేసే చిన్నస్థాయి ఉద్యోగినుండి తన పై అధికారుల వరకూ అందరికీ తనకు చేతనైన మేరకు సలహాలు సూచనలు ఇస్తూ వారికి అవసరమైన సహాయం చేస్తూ, చేదోడు వాదోడుగా ఉండేవాడు. వయసుతో నిమిత్తం లేకుండా అందరితోనూ ఆత్మీయంగా మెలిగేవాడు. ఆయన పూర్తి పదవీ కాలంలో ఒక్క నెల్లూరులోనే 20 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేశాడు. పన్నెండేళ్ళ క్రితం పదవీ విరమణ పొందినా ఇప్పటికీ తన పాత మిత్రులను సహఉద్యోగులను నిత్యం పలకరిస్తూనే ఉంటాడు. తాను సొంతంగా కంప్యూటర్లో తయారుచేసుకున్న గుడ్ మార్నింగ్ మెసేజీలతో ఆప్తులను మేల్కొలుపుతుంటాడు, ఆగస్టు 8వ తేదీ ఆయన చివరి శ్వాస తీసుకోవడానికి గంట ముందు సుమారు 6.19 నిముషాలకు కూడా చాలామందికి ఈ మెసేజ్ పంపాడు. సరిగ్గా గంట తరువాత కాలంచేశాడు.

తమ ఇంటి పెద్దదిక్కును కోల్పోయి విషాదంలో వున్న రఘురామిరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ.. ఆయన ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది లాయర్.



# సహజకవి.. మల్లెమాల

**కృషితో నాస్తి దుర్భిక్షమ్ అనే ఆర్యోక్తిని ఆలంబనగా చేసుకొని, పల్లె నుండి అంచెలంచెలుగా ఎదిగి తాను ఆశించిన ఉన్నత శిఖరాలను అందుకున్న పరిపూర్ణ వ్యక్తి, మహోన్నతుడు మల్లెమాల సుందరరామిరెడ్డి. ఆయన అచ్చమైన పదహారణాల తెలుగు కవి. సింహపురి సీమకే గర్వకారణమైన సాహితీవేత్త.**

సహజకవి, మల్లెమాల, ఎమ్మెస్ రెడ్డి, బహు నామాలతో పరిచయమైన ఏక స్వరూపులు వీరు. ఫోటో స్టూడియో పెట్టుకోవాలని మద్రాసు నగరం చేరుకొని నిర్మాత, నటుడు, పాటల రచయిత, స్క్రీన్ ప్లే రచయితగా, సినిమాహాలు యజమానిగా ఎన్నో రంగాలలో విజయవంతమైన వ్యక్తిగా నిలిచిపోయారు. ఎన్నో శిఖరాలను అధిరోహించారు.

నెల్లూరు జిల్లా బాలాయపల్లి మండలంలోని 'అలిమిలి' అనే చిన్న పల్లెలో 1924 ఆగష్టు 15న పుట్టిన వీరు కృషి, శ్రమ, దీక్షలకు పర్యాయపదమై నిలిచి, అతి పెద్ద కుటుంబంలో నుండి, అనేక బరువు బాధ్యతలు మోశారు. మట్టిని, తన పుట్టిన నేలను ఏనాడూ మరవలేదు. ఫోటోస్టూడియో పెడదామని మద్రాసు వెళ్లిన మల్లెమాల, 1966లో 'కన్నెపిల్ల' డబ్బింగ్ సినిమా నిర్మాతగా సినీ రంగంలో ప్రవేశించారు. ఆ పరిశ్రమలో ఎదుగుతూ ఎదురు దెబ్బలు తింటూనే ముందుకు నడచిన కార్యదీక్షాతత్పరుడాయన. ఆ తరువాత పట్టుదలతో 'కౌముదీ' సంస్థను ఏర్పరచి ఎన్టీఆర్ నుండి, చిరంజీవి వరకు 25 సినిమాలుపైగానే నిర్మించి సాహసోపేతమైన నిర్మాతగా నిలదొక్కుకున్నారు. నాయుడుబావ, శ్రీకృష్ణ విజయం, ముత్యాలపల్లకి, పల్నాటి సింహం, ఊరికి ఉపకారం, ఏకలవ్య, రామబాణం, కోడెనాగు, తలంబ్రాలు, అంకుశం, ఆగ్రహం, భార్య, అమ్మోరు, అరుంధతి, అంజి లాంటి వైవిధ్య భరితమైన చిత్రాలను అందించారు. కోడెనాగు చిత్రంలో తనకు ఇష్టుడైన ఆచార్య ఆత్రేయ చేత బలవంతంగా నటింపచేసి తన కోరిక, అభిమానాన్ని చాటుకున్నారు. మద్రాసులో తొలి సినిమాహాలు నిర్మించిన తెలుగు నిర్మాతగా నిలిచిపోయారు. అంకుశంలో తాను ముఖ్యమంత్రి పాత్ర పోషించి తెలుగుదనాన్ని నెల్లూరు నుడికారాన్ని బహు చక్కగా అందించిన ధీశాలి ఎమ్మెస్ రెడ్డి.

## సాహిత్యంలో ప్రత్యేక ముద్ర

నెల్లూరు మాండలీకాన్ని, పల్లెదనాన్ని నిండుగా ప్రేమించే వీరు తొలి నుండి తెలుగు సాహిత్య పిపాసి. కవిత్వమంటే ఓ బాధ్యత, ఒక తపన అని చెబుతుండే వీరు, సినిమా సాహిత్యంలో కూడా తనదైన ప్రత్యేకముద్ర వేసి, నూతన ఒరవడికి నాంది పలికారు. 'ముత్యాల పల్లకి' చిత్రంలో 'తెల్లవారక ముందే పల్లె లేచింది' లాంటి స్వచ్ఛమైన, కమ్మనైన పాటలను సినీ రంగంలో దాదాపు 500పైగా అందించారు. చందోబద్ధంగా రాసినా, వచనంలో రాసినా చాలా స్వచ్ఛమైన తెలుగు భాషను, సహజమైన భాషలోనే రాయటం మల్లెమాల ప్రత్యేకత. అందుకే ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు ఆయనను అభినందిస్తూ "సహజకవి" బిరుదును అందించారు. ఓ తెలుగు కవిగా బ్రిటన్, అమెరికా, కెనడా, సింగపూర్, మలేషియా లాంటి పలు దేశాల సదస్సులలో తన వాణిని, బాణిని వినిపించి తెలుగు భాషకే కాదు, తెలుగు జాతికే గర్వకారణమయ్యారు. 1988లో బాంకాంక్‌లో 'వరల్డ్ పొయట్స్ కాంగ్రెస్'లో స్ట్రేథాట్స్ అనే ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కర్తవ్యం, భాష్పాంజలి, అభినందనం, కన్నీటి కెరటాలు, మంచు ముత్యాలు, అక్షరశిల్పాలు, నిత్యసత్యాలు లాంటి ఎన్నో కావ్యాలు గ్రంథాలను రాశారు. వారు రాసిన 'మల్లెమాల రామాయణం' విశేష ఆదరణ పొంది బహు ప్రశంసలు, అవార్డులు సాధించి పెట్టింది. కానీ 'ఇది నా కథ' అనే పేరుతో రాసిన ఆత్మకథ కొంత వివాదం, కలకలం రేపింది. సినిమా ప్రముఖులతో ఉన్న అనుభవాలు యధాతథంగా పొందుపరచటమే అందుకు కారణమంటారు. అలాగే సాహిత్య పరంగా డాక్టరేట్ కూడా అందుకున్నారు. దూరదర్శన్‌లో వీరి రామాయణం ధారావాహికంగా ప్రసారమై, విశేష ఆదరణ పొందింది.

## పదవులకే వన్నె తెచ్చారు

తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడుగా, దక్షిణభారత చలనచిత్ర రచయితల అధ్యక్షుడుగా, వాణిజ్య మండలికి కోశాధికారిగా, ఎ.పి. ఫిలిం డెవలప్‌మెంట్ ఛైర్మెన్‌గా, ఫిలింనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షునిగా ఆయన ఎన్నో బాధ్యతలు ఒంటిచేత్తో అవలీలగా నిర్వహించిన ప్రజ్ఞాశాలి. తాను ఏ పదవిలో వున్నా ఆ పదవికే వన్నె తెచ్చిన మహనీయ వ్యక్తి మల్లెమాల.

## ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు

మల్లెమాల నిర్మించిన చిత్రాలన్నీ ప్రేక్షకాదరణ పొందడమే కాక, పలు చిత్రాలు విశిష్టమైన అవార్డులను కూడా సాధించాయి. 1998లో 'బాల రామాయణం' సినిమాకు జాతీయ అవార్డుతో పాటు నంది అవార్డు కూడా లభించింది. అదే విధంగా 2005లో రఘుపతి వెంకయ్య అవార్డును కూడా ఆయన అందుకున్నారు. అలాగే కుటుంబపరంగా అందరితో ఆప్యాయంగా ఉంటూ తమ్ముళ్లను మెడిసిన్ చదివించారు. ఆయన కుమారుడే ప్రముఖ నిర్మాత శ్యాంప్రసాదరెడ్డి. నెల్లూరన్నా, నెల్లూరు యాస, భాష అన్నా ఎంతో ఇష్టపడే మల్లెమాల 2011 డిసెంబరు 11న దివికేగినా... చిరస్మరణీయమైన వ్యక్తిగా నిలిచిపోయారు.

## మరో వాల్మీకి..

వెలుతురు చిరునవ్వులతో ఆహ్వానించే కర్మసాక్షి లాంటి కవి
ఆశీస్సుల వెన్నెల కురిపించే చందమామ లాంటి వాడు
ఎక్కడికి వెళతాడు.. అక్షరాల్లోకి నిష్క్రమించిన వాడు
అక్షరమై ప్రకాశిస్తూ అమరుడై పోయినవాడు
మాటల మంచీ చెడులను వేరుచేసిన శ్వేత హంస
కుండ బద్దలు కొట్టిన కఠిన సత్యాల నిత్య చికీర్ష
మల్లె మాలంత స్వచ్ఛమైన పరిమళాల పోహళింపు
నిత్యం వీచే మలయ మారుతమైన ఆత్మీయ స్పర్శ
చిక్కని పల్లె నుడికారాల తేనె కురిసినప్పుడల్లా
ఎంచక్కని తెలుగు పంచెకట్టు ప్రత్యక్షమైనప్పుడల్లా
ఆరడుగుల ఒక నిక్కచ్చి ఆంధ్రుడు పక్కనే నిలిచినట్టుంటుంది
అతడి కవన దవన పరిమళ  ప్రభంజనం వీచిన్నట్టే ఉంటుంది
హలం పట్టి కలం పట్టి గళం విప్పి గేయం పాడిన వాడు
మాకొద్దీ జమిందారి పెత్తనమంటూ విప్లవం సృష్టించిన వాడు
మహిత వినయ శీలుడై పద్యాన్ని పాఠక నైవేద్యం చేసిన వాడు
అక్షర శిల్పాల్లో నిత్య సత్యాలు మలిచి మంచు ముత్యాలు కురిసిన వాడు
ఎందరో మహానుభావులకి పద్య గద్యాల వందనాలర్పించిన వాడు
మరణరహస్యం ఛేధించిన వాడికి జీవితం ఒక ఆసరా కాదు
మరణించి కూడా అక్షర మహర్షిగా జీవించి ఉండటమే అతడిచ్చే భరోసా
'మళ్లీ పుట్టిన వాల్మీకి'..
సహజకవి' కిదే వాసన వీడని వాడని మల్లెమాల!

(15న మల్లెమాల గారి జయంతి సందర్భంగా )
ఈతకోట సుబ్బారావు, నెల్లూరు. 9440529785



# నాటి మణిమండప క్షేత్రమే.. నేటి అళఘుమల్లారి కృష్ణస్వామి దేవాలయం

**ఎప్పుడో పురాణకాలం నాటి మణిమండప క్షేత్రమే.. నేటి అళఘుమల్లారి కృష్ణస్వామి దేవాలయంగా ప్రసిద్ధి. సూళ్ళూరుపేట మండలంలోని మన్నారుపోలూరు గ్రామంలో కొలువై ఉన్న పురాతన క్షేత్రం.. శ్రీ సత్యవతీదేవి-జాంబవతీ సమేత అళఘుమల్లారి శ్రీకృష్ణస్వామి దేవాలయం. జిల్లాలో ఎంతో పురాతనమైన ఈ ఆలయం చోళరాజుల శిల్పకళా వైభవానికి ప్రతీకగా కూడా ప్రసిద్ధి.**

మన దేవాలయాలు ⑧

నెల్లూరుజిల్లాలో మండల కేంద్రమైన సూళ్ళూరుపేటకు కేవలం రెండు కిలో మీటర్ల దూరంలో, సూళ్ళూరుపేట-శ్రీకాళహస్తి మార్గంలో ఉన్న మన్నారు పోలూరు గ్రామంలో భక్తులకు కొంగు బంగారంగా వెలసివున్న ఆలయమిది. ఎప్పుడో పురాణకాలం నాటి చరిత్రతో పాటు, ప్రాచీన చరిత్ర, ఆసక్తిగొలిపే స్థల పురాణం వగైరాలు ఈ ఆలయచరిత్రను మనకు విశదం చేస్తున్నాయి.

## ద్వాపరయుగం నాటి చరిత్ర :

ద్వాపరయుగంలో సత్రాజిత్తు అనే రాజు తపస్సు చేసి సూర్యభగవానుని నుంచి శమంతకమణిని పొందుతాడు. ఆ మణిని ధరించి శ్రీకృష్ణుని ఆస్థానానికి వెళ్ళగా ఆ మహిమాన్వితమైన మణి రోజుకు ఎనిమిది బారువల బంగారం ప్రసాదిస్తుందని తెలుసుకున్న శ్రీకృష్ణుడు ప్రజల క్షేమం కోసం ఆ మణిహారాన్ని తనకివ్వమని కోరగా అందుకు సత్రాజిత్తు నిరాకరించి ఆ మణిని తన తమ్ముడైన ప్రసేనుడి మెడలో వేస్తాడు. ఆ తర్వాత ప్రసేనుడు వేటకు వెళ్ళినప్పుడు ఓ సింహం ప్రసేనుణ్ణి చంపేస్తుంది. అడవిలో ఆ సింహం వద్ద ఉన్న శమంతకమణి హారాన్ని చూసిన జాంబవంతుడు ఆ సింహాన్ని వధించి తన కుమార్తె అయిన జాంబవతికి ఆ మణిని ఇస్తాడు. ఈ విషయం తెలియని సత్రాజిత్తు శ్రీకృష్ణుడే ఆ మణిహారాన్ని అపహరించాడని అపనింద వేస్తాడు. దీంతో శ్రీకృష్ణుడు ఆ మణి కోసం అన్వేషణ చేస్తూ జాంబవంతుని వద్దకు వస్తాడు. జాంబవతి మెడలో ఉన్న మణిహారాన్ని చూస్తాడు. శ్రీకృష్ణుడు మణి కోసం వచ్చాడని తెలిసిన జాంబవంతుడు ఆ మణిని ఇవ్వడానికి నిరాకరించి శ్రీకృష్ణుడితో మల్లయుద్ధానికి తలపడతాడు. దీంతో 21 రోజుల పాటు ఇరువురి మధ్య యుద్ధం జరుగుతుంది. చివరికి జాంబవంతుడు ఓటమిని అంగీకరించి తనను ఓడించింది సాక్షాత్తూ శ్రీమహావిష్ణువేనని, శ్రీరాముని అవతారమని గ్రహించి శరణు వేడుకుని శమంతకమణితో పాటు తన కుమార్తె జాంబవతిని ఇచ్చి శ్రీకృష్ణునికి వివాహం జరిపిస్తాడు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు ఆ మణిని తెచ్చి సత్రాజిత్తుకు ఇస్తాడు. సత్రాజిత్తు జరిగిన విషయం తెలుసుకుని పశ్చాత్తాపపడి శమంతకమణితో పాటు తన కుమార్తె సత్యభామాదేవిని శ్రీకృష్ణునికిచ్చి వివాహం జరిపిస్తాడు. అందుకు ప్రతీకగా ఈ ప్రాంతం పురాణ కాలం నుంచి కూడా మణిమండప క్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని, శమంతకమణి కోసం జాంబవంతుడు, శ్రీకృష్ణుడు యుద్ధం చేసిన స్థలం ఇదేనని స్థలపురాణం చెప్తోంది.

## ఎంతో అరుదైన ఆలయం :

ఈ ఆలయం పురాతనమైనదే కాక, ఎంతో అరుదైనది కూడా. శ్రీకృష్ణుడు సత్యభామ-జాంబవతిదేవి ఈ ముగ్గురూ ఒకేచోట కొలువై ఉన్న ఈ ఆలయం ఎంతో విశిష్టమైనది. జాంబవంతునితో మల్లయుద్ధం చేసిన స్వామి కనుక, శ్రీకృష్ణునికి మల్లహరి కృష్ణస్వామిగా పేరువచ్చిందని, అదే కాలక్రమంలో అళఘ (అందమైన) మల్లారి కృష్ణస్వామి దేవాలయంగా ప్రఖ్యాతి చెందిందని అంటారు. ఆ తర్వాత 10వ శతాబ్దంలో చోళరాజులు ఇక్కడ ఎంతో అద్భుతమైన రీతిలో ఈ ఆలయం నిర్మించినట్లు చరిత్ర పేర్కొంటోంది.

## అపూర్వమైన గరుత్మంతుని విగ్రహం



ఈ ఆలయంలో మరో విశిష్టత కూడా ఉంది. క్షేత్ర పాలకుడైన గరుత్మంతుని విగ్రహం ఇక్కడ సుమారు తొమ్మిదిన్నర అడుగుల ఎత్తైనది కావడం అపూర్వమైన విషయం. ముకుళితహస్తాలతో కన్నీరు ఒలుకుతున్నట్లుగా కనిపించే ఈ విగ్రహం నాటి చోళరాజుల కళా ప్రతిభకు ప్రతీక అని చెప్పవచ్చు. అంతే కాదు, ప్రధాన ఆలయం వెనుక తొమ్మిదిన్నర అడుగుల ఎత్తున్న జాంబవంతుని విగ్రహంతో పాటు, ఆలయంలో శ్రీకృష్ణ, శ్రీరామ మందిరాలు విడివిడి ధ్వజ స్థంభాలతో కొలువుదీరి ఉండడం విశేషం.

వీక్షణం - మంజీర

# సెక్యులర్ రాముడు

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. బ్రిటిష్ పాలకుల విభజించు పాలించు విధానంలో ఏకత్వంలో భిన్నత్వంగా మారిపోయింది. అలా విభజితమైన దేశం... అదే బ్రిటిష్ పాలకులను ఎదిరించడానికి జాతీయోద్యమం వేదికగా ఒకటైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బ్రిటిష్ వాసనలు పూర్తిగా వదులుకోకుండా ఉత్తరాది - దక్షిణాదిగా అప్రకటిత విభజనకు గురైంది. సాంస్కృతికంగా, సాహిత్యపరంగా ఉత్తరాదిని దక్షిణాదిని కలిపి భారతావనిగా ఏకీకరణ చేయగలిగిన బంధం... అందరి బంధువు రాముడు. మనదేశం ఇప్పుడు రాముడినే నెపంగా చూపిస్తూ లౌకికవాదం - ఆధ్యాత్మిక వాదంగా విభజితమవుతోందా? అనే వాదనలు వినిపిస్తున్నాయి. రాముడిని వ్యతిరేకించడమే సెక్యులరిజమ్‌గా పరిగణనలోకి వస్తోంది. నిజానికి మనకు సెల్యులాయిడ్ రాముడు తెలిసినంతగా సెక్యులర్ రాముడు తెలియదు.

## వైష్ణవం - శైవం

రాముడు స్వయానా శ్రీమహావిష్ణువు స్వరూపమని, దశావతారాల్లో ఒక అవతారమని భారతీయుల విశ్వాసం. త్రేతాయుగంలో కూడా వైష్ణవం - శైవం మధ్య స్వల్ప దూరాలుండేవి. అలాంటి సమయంలో స్వయంగా శివలింగాలను ప్రతిష్ఠించి దైవత్వానికి రూప అభేదాన్ని చెప్పింది శ్రీరాముడు. తొలి వేదకాలంలో మనుషులందరూ సమానమే అన్నట్లున్న సమాజం మలివేదకాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థతో సామాజిక విభజనకు లోనయింది. అగ్రవర్ణాలన్నీ చాతుర్వర్ణ వ్యవస్థను పటిష్ఠం చేయడానికే మొగ్గు చూపుతున్న రోజుల్లో శ్రీరాముడు కులాలకతీతంగా అందరితో స్నేహం చేశాడు. తన కోసం పడవ నడిపిన బోయవాడు గుహుడిని స్నేహితుడన్నాడు. ఆదివాసీ మహిళ శబరి కొరికి ఇచ్చిన పండ్లను భుజించి తన పట్ల ఆమెకున్న భక్తిని గౌరవించాడు రాముడు. హనుమంతుడిలో దాసుడికి బదులు హితుడిని చూసినవాడు. అలాగే ప్రత్యర్థికి - శత్రువుకి మధ్య భేదం తెలిసిన విజ్ఞుడు కూడా.

## రామరాజ్యంలో సత్వర న్యాయం

అత్యుత్తమ పరిపాలనను రామరాజ్యంతో పోల్చడం వాడుకలోకి వచ్చింది. రామరాజ్యం అంటే ప్రజలు పని చేయకుండా ఉయ్యాలలూగుతూ జీవించారని కాదు. ప్రజల శ్రమకు తగిన ఫలితం దక్కేది, పౌరులకు పన్నులు సక్రమంగా చెల్లించడం తమ ధర్మం అనే ధ్యాస ఉండేది. జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్... అని మనం ఆధునిక కాలంలో రాసుకున్నాం. రామరాజ్యంలో బాధితుడికి సత్వర న్యాయం జరిగేది. 'ఎంతో కాలం నుంచి రామరాజ్య భావన మనలో వేళ్లూనికుని పోయి ఉంది. నేటి పాలకులు, రాజనీతిజ్ఞులు, సామాజిక సంస్కర్తలు కూడా రామాయణం నుంచి పాఠాలు రాసుకోవాల'ని గాంధీజీ అన్నారు.

## బాబరుకు ముందు

బాబరు మనదేశంలోకి క్రీస్తుశకం 1526లో వచ్చాడు. ఢిల్లీ సుల్తాను ఇబ్రహీం లోధీని ఓడించి భారత దేశంలో మొఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఆ తర్వాత నాలుగేళ్లకే 1530లో మరణించాడు. ఈ మధ్య కాలంలో బాబర్ చేసిన ఒక దుస్సాహసమే అతడిని యోధుడిగా కంటే వివాదాస్పదుడిగా మిగిల్చింది. అయోధ్యలో ఉన్న రామమందిరం స్థానంలో మసీదు నిర్మాణం అటు చరిత్రకు, సంస్కృతికి, విశ్వాసానికి, విశ్వసనీయతకు మధ్య చర్చనీయాంశంగా మారింది. బాబర్‌కు ముందు మనదేశంలోకి వచ్చి రాజ్యాలను స్థాపించిన ఇస్లాం పాలకులు హిందూస్థాన్‌కు స్వతహాగా ఉన్న సంస్కృతి సంప్రదాయాల మీద దాడి చేయ లేదు. హిందూస్థాన్ ప్రజల జీవన విధానమే హిందూ సంస్కృతి, అదే హిందూ సంప్రదాయం, అదే హిందూ మతం. హిందూస్థాన్‌లో అడుగుపెట్టిన ఫార్సీలు, కుషాణుల వంటి విదేశీయులు ఎవరూ హిందూస్థాన్ జీవనశైలిని మార్చే ప్రయత్నం చేయలేదు. ఈ జీవనశైలితో మమేకమై తమ అలవాట్లను కొనసాగించుకున్నారు.

## సెక్యులర్ దాడి

బాబర్ 16వ శతాబ్దంలో హిందూస్థాన్ విశ్వాసం మీద నేరుగానే దాడి చేశాడు. ఇప్పుడు ఈ 21వ శతాబ్దంలో అభ్యుదయ వాదం, ఉదారవాదం.. హిందూమతం మీద దాడి చేయడానికి రాముడిని సాధనంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. అంతే తప్ప నిజానికి ఆ వాదాలకు శత్రువు రాముడు కాదు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కరుణానిధి కూడా రామసేతు వివాదం సమయంలో రాముడే లేడని వాదించడానికి... రాముడుండేవాడని వాదించే జయలలితకంటే ఎక్కువగా రాముడిని తలుచుకున్నాడు. తాజాగా భారతదేశంలోని హిందూత్వ మీద దాడి చేయబోయిన నేపాల్ ప్రధానమంత్రి, కమ్యూనిస్ట్ నాయకుడు కేపీ శర్మ ఓలి అయితే... వాళ్ల సిద్ధాంతం ప్రకారం రాముడనే వ్యక్తి భూమ్మీద జీవించలేదని వాదించాల్సిన వాడు కాస్తా... రాముడు పుట్టింది భారత్‌లో కాదు నేపాల్‌లో అన్నాడు.

## బాబర్ వారసుడి విరాళం

ఈ ఏడాది ఆగస్టు ఐదవ తేదీన మందిర నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఇందులోనూ మళ్లీ సెక్యులర్ వివాదమే. రాజ్యాంగం ప్రకారం మనది సర్వసత్తాక లౌకిక రాజ్యం. ప్రధానమంత్రి మందిర నిర్మాణానికి భూమి పూజ చేయడం ద్వారా లౌకికతకు విఘాతం కలిగిందనేది కొందరి వాదన. లౌకిక రాజ్యంలో పాలకుడు తనకు ఇష్టమైన మతాన్ని అవలంబించవచ్చు, అయితే ఇతర మతాలను కూడా ఆదరించాలి. అంతేతప్ప మతానికతీతంగా ఉండాలని కాదు. పైగా హిందూస్థాన్ జీవనశైలికి 'నువ్వు పరాయి మతానికి చెందిన వాడివి' అని దూరంపెట్టే సంస్కృతిలేదు. మొఘల్ పాలకుల వారసుడు యాకూబ్ హబీబుద్దీన్ టుసీ రామమందిర నిర్మాణానికి ఒక కిలో బంగారు ఇటుకను విరాళంగా ఇవ్వడాన్ని స్వాగతించిన జీవనశైలి హిందూస్థాన్‌ది. ఇస్లాం మతావలంబకులు చేత మందిరానికి గంటను తయారు చేయించుకుంటున్న సంస్కారం కూడా మనకు రాముడు నేర్పినదే. అందరూ భారతీయులు. అదే రామతత్వం, రాముని వాదం. రాముడు నేర్పిన జాతీయత.

## భారత రామాయణాలు

15వ శతాబ్దంలో శంకరదేవ అనే కవి అస్సామీ భాషలో 'శ్రీరామ విజయం' రాశాడు. 14వ శతాబ్దంలో గోన బుద్ధారెడ్డి తెలుగులో రంగనాథ రామాయణం, 12వశతాబ్దంలో తమిళ కవి కంబర్ 'కంబర్ రామాయణం', 15వ శతాబ్దంలోనే బెంగాలీలో కృత్తిబాస్ ఓఝూ కృత్తిబాస్ రామాయణం రాశారు. మొఘల్ సామ్రాజ్య స్థాపన తర్వాత పెద్దగా ప్రాభవం సాధించని 16వ శతాబ్దంలో కన్నడంలో నరహరి థోరవే రామాయణం, అవధిలో తులసీదాస్ రామచరిత మానస్ రాశారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాముడు ప్రధాన పాత్రగా సాహిత్యం పరిఢవిల్లింది. జైన సాహిత్యంలో కూడా రాముడికి కీలకమైన స్థానమే ఉంది.

# అనుమానం పెను భూతం...!



డా. ఎ.వేణుగోపాలరెడ్డి
హైదరాబాదు. సెల్. 9948106198

కోవిడ్ 19 ఇప్పుడు ప్రపంచం మొత్తం చుట్టుముట్టింది. లాక్‌డౌన్, టెస్టింగ్, ట్రేసింగ్, ఐసోలేషన్, ట్రీట్మెంట్ ఇలా అనేక పద్ధతులు ఉపయోగిస్తూ ప్రజలూ, ప్రభుత్వాలు పోరాడుతున్నాయి. దాదాపు 2 కోట్ల మందికి సోకిన ఈ వైరస్ ఇప్పటికే 7 లక్షల మరణాలకు కారణం అయింది. అదే సమయంలో 42% ప్రజలు కోవిడ్-19తో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు అంటే సుమారు 300కోట్ల మంది ప్రజలు ఈ స్థితిలోవున్నారు. ఈ వైరస్ నుండి కోలుకున్నవారిలో అనేకమంది శారీరక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది ఇలా ఉండగా ఎటువంటి వ్యాధి లేకున్నా కోవిడ్ బారిన పడ్డామేమో అనే అనుమాన భయంతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువవుతోంది. వీరిని Worried Well అంటారు. Worried Well అనే పదం మొదటిసారిగా HIV సమయంలో వచ్చింది. PILCH అనే శాస్త్రవేత్త వీరిని మూడు రకాలుగా వర్గీకరించాడు

1. ఎటువంటి వ్యాధి లేకున్నా, మానసిక ఆందోళన వల్ల వ్యాధి లక్షణాలు ప్రదర్శించడం
2. ఎటువంటి వ్యాధి లేకున్నా, ముమ్ముందు వైరస్ బారిన పడతామేమో అని ముందస్తుగా డాక్టర్ సహాయం, చికిత్స కోరేవారు.
3. కుటుంబంలో ఎవరైనా అలాంటి వ్యాధి బారిన పడితే తాము కూడా అదే వ్యాధి బారిన పడతామని ఆందోళన చెందే వారు.

## కోవిడ్-19 & WORRIED WELL

వ్యాధి లేకున్నా వ్యాధి ఉన్నట్లు భావించేవారు తాము ఇబ్బందిపడటమే కాకుండా ఆరోగ్య వ్యవస్థపై కూడా ఇబ్బంది ఒత్తిడి కలిగిస్తారు. వారు పదే పదే ఆసుపత్రికి రావడం వల్ల అసలు నిజంగా అవసరం ఉన్న వారికి డాక్టర్లు అందుబాటులో ఉండలేకపోయే ప్రమాదం ఉంది. ఆసుపత్రిలో మౌలిక వసతుల కొరత ఏర్పడుతుంది. వీరు ముందస్తుగా మందులు కొనిపెట్టుకోవడం వల్ల అవసరం అయిన వారికి మందులు అందుబాటులో ఉండవు. అనేక సార్లు టెస్టులకి రావడం వల్ల లాబ్స్ సరిపోవు. వీరికి నెగటివ్ వచ్చినా నమ్మరు. ఇప్పటికే సరిపడని ఆరోగ్యవసతులు మరింత ఒత్తిడిలోకి నెట్టబడుతాయి.

**నివారణ :**
1. ప్రజలందరికీ ఖచ్చితమైన సమాచారం అందేలా చూడాలి.
2. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాని బాగా వినియోగించాలి.
3. వ్యక్తులు సకరాత్మక ఆలోచన పెంపొందించుకోవాలి.
4. కుటుంబ సభ్యులు సహకరించాలి. అవసరమైన భరోసా ఇవ్వాలి.
5. మానసిక వైద్య నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ సదుపాయాలు అందుబాటులో ఉంచాలి.
6. డిజిటల్ సమాచారాన్ని ఎక్కువగా విశ్వసించొద్దు.
7. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి.

ఈ విధంగా చేయడం ద్వారా ఈ సమస్యని అధిగమించవచ్చు.

# కార్మిక చట్టాలను పట్టించుకోని కేంద్రం - సిఐటియు విమర్శ

కార్మిక చట్టాలను కేంద్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందంటూ నెల్లూరులోని సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల9న నగరంలోని ప్రభుత్వ ఫ్యాక్టరీకమిషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు కిన్నెర ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన కార్మికులకు కేంద్రం నెలకు 10వేల రూపాయలతో పాటు, 10 కిలోల రేషన్‌బియ్యం ఇచ్చి ఆదుకోవాలని కోరాడు. ఈ ఆందోళనలో సిఐటియు నాయకులు చెంచయ్య, శ్రీనివాసులు, గురవయ్య, జనార్ధన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అచ్యుత సుబ్రహ్మణ్యం ఇక లేరు



నెల్లూరులోని అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణమండపం అధినేత అచ్యుత సుబ్రహ్మణ్యం (76) ఆగష్టు 7వతేది కన్నుమూశారు. కొన్నేళ్ళక్రితం క్యాన్సర్ వ్యాధిని జయించిన ఆయన ఈసారి కరోనా మహమ్మారితో పోరాడి మృత్యువు ముందు తలవంచక తప్పలేదు.

గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతంలోని నందివెలుగు గ్రామంలో ఒక సాధారణ చిల్లర కొట్టు వ్యాపారి దంపతులకు 1944లో సుబ్రహ్మణ్యం జన్మించాడు. తమ వూరికి 6 మైళ్ళ దూరంలో వున్న బడికి వెళ్లి ఎస్ఎస్ఎల్‌సి వరకూ చదువుకున్నప్పుడే ఆయన కష్టం అంటే ఏంటో తెలుసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా బడి సెలవు రోజుల్లో సైకిలుపై ధాన్యం అమ్మేవాడు. ఆ తరువాతి కాలంలో ప్రకాశం జిల్లా కనిగిరిలో ఒక బట్టల దుకాణంలో గుమాస్తాగా చేరి వ్యాపారంలో మెళకువలు నేర్చుకుని సమీప బంధువు ఆర్థిక సహాయంతో నెల్లూరులో సొంతంగా బట్టల వ్యాపారం మొదలుపెట్టి చేతులు కాల్చుకున్నాడు. అయినా అధైర్యపడలేదు సొంతంగానే బనీన్ల వ్యాపారం మొదలుపెట్టాడు ఇక అక్కడినుండి వెనుతిరిగి చూడలేదు. లక్ష్మి బనియన్ స్టోర్స్, విజయలక్ష్మి టెక్స్ టైల్స్ పేరుతో వ్యాపారాలను అంచలంచెలుగా విస్తరింపచేసి బనియన్ల సుబ్రహ్మణ్యంగా ప్రఖ్యాతి చెందాడు. నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండుసార్లు సమర్ధవంతంగా పనిచేసి గుర్తింపు పొందాడు.

నెల్లూరు, దర్గామిట్ట పోలీస్ ఆఫీస్ రోడ్డులో తన పేరుమీదనే అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణమండపాన్ని నిర్మించి 2003 జులై 6న, ప్రారంభించాడు. ఆయన స్ఫూర్తితో ఆ రోడ్డు మొత్తం కళ్యాణమండపాలతో నిండిపోయింది. కృషితో నాస్తి దుర్భిక్షం అన్న మాటలకు ఆయనొక నిదర్శనం.

ఎదిగే కొద్దీ ఒదగాలన్న సూత్రాన్ని ఆయన పాటించేవాడు , అందరితో సౌమ్యంగా మెదిలేవాడు, లయన్స్ క్లబ్ వేదికగా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టాడు. సమాజ సేవకు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు. ఇటీవలే నెల్లూరు రంగనాయకులస్వామి దేవస్థాన ప్రాంగణంలో వున్న శ్రీ వెంకటేశ్వర ఆలయానికి 10 లక్షల రూపాయల ఖర్చుతో ఆలయంచుట్టూ స్టైన్‌లెస్ స్టీలుతో రక్షణ వలయాన్ని చేయించడంతో పాటు ఆ ప్రాంగణాన్ని ఆధునీకరించాడు. సుబ్రహ్మణ్యానికి భార్య సులోచన, కుమారుడు శివ మణికంఠ, కోడలు ఇద్దరు మనుమళ్ళు వున్నారు. వారి కుటుంబానికి మనోస్థైర్యాన్ని కలుగచేయాలని భగవంతుడిని కోరుకుంటూ ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### యువనేత చొరవతో..

# పరుగులెత్తనున్న పరిశ్రమలు

**రాష్ట్రప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా యువనేత.. ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో ఇక రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి పరుగులు తీయనుంది. దేశంలోనే అపూర్వమైన విధంగా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. వినూత్నమైన రీతిలో కొత్త పారిశ్రామిక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. పారిశ్రామికవేత్తలకే కాక, నిరుద్యోగ యువతకు..ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు ఇదో పెద్ద వరం. అక్కచెల్లెమ్మల అభ్యున్నతికి ఒక అన్నగా తాను అండగా ఉన్నానంటూ జగన్ అన్నమాట నిలబెట్టుకుంటూ ఈ నూతన పారిశ్రామిక విధానంలో మహిళా పారిశ్రామికవేత్తలకు వరాల జల్లు కురిపించి అందరి అభినందనలు అందుకుంటున్నారు.**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఆలోచనలను, కరోనా నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలపాలన్నదే ధ్యేయంగా ఈనెల 10న రాష్ట్రప్రభుత్వం 'వైయస్సార్ ఏపి వన్' పేరుతో ఒక కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందించింది. దీంతో పరిశ్రమల రంగానికి కొత్త ఊపిరి వచ్చినట్లయింది. ఈ నూతన విధానంతో ఇక రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి ఎంతో వేగవంతమవుతుందని పారిశ్రామికవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పరిశ్రమ ఏర్పాటుకోసం ప్రతిపాదన వచ్చిన దగ్గరనుంచి ఆ పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత కూడా శాశ్వతప్రాతిపదికన అండగా నిలిచేవిధంగా 'వైయస్సార్ ఏపి వన్' కార్యక్రమానికి రూపకల్పన చేయడంతో పరిశ్రమల రంగానికి కొత్త ఊపు వచ్చినట్లయింది.




### పారిశ్రామికవర్గాలకు భరోసా :

2020-23 సంవత్సరాలకు ఈ కొత్త పారిశ్రామిక విధానం అమలయ్యేలా ప్రభుత్వం అన్నివిధాలా ఏర్పాట్లు చేస్తోంది. దేశంలోనే తొలిసారిగా 10 రంగాల్లో ఉన్న పరిశ్రమలకు ప్రభుత్వం చేయూతనిస్తూ ఈ విధానాన్ని రూపొందించడం విశేషం. ఈ కార్యక్రమం కింద మహిళా సాధికారతలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు నెలకొల్పే పరిశ్రమలకు అధిక రాయితీలు ఉండేలా చూస్తోంది. మహిళలకు రాయితీలు, స్థానికుల ఉపాధి కల్పనకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రంలో పరిశ్రమలకు పెట్టుబడులు పెట్టేవారికి నష్టాలు వస్తాయనే ఆందోళన లేకుండా పరిశ్రమలు నిలదొక్కు కునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రత్యేక చొరవతో చర్యలు తీసుకుంటుండడం పట్ల పారిశ్రామికవర్గాల్లో భరోసా ఏర్పడు తోంది. ఈ వినూత్న విధానంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చూస్తున్నారు. అన్ని మౌలిక వసతులతో పారిశ్రామిక పార్కులను క్లస్టర్ల విధానంలో ఏర్పాటు చేయడానికి, పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడానికి ఈ కొత్త పాలసీ ఎంతో అనువుగా ఉంటుంది కూడా. దీంతో పరిశ్రమల యజమానులకు నిర్వహణ వ్యయం బాగా తగ్గేవిధంగా అవకాశం ఉండడంతో పారిశ్రామికవేత్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### యువత కోసం 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్'

ఈ కొత్తవిధానంలో భాగంగా నైపుణ్యం కలిగిన యువత వివరాలతో ఒక క్రమబద్ధమైన 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్' ఏర్పాటుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య, వారి నైపుణ్యాల వివరాలతో పాటు రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలకు ఎంతమంది ఉద్యోగులు అవసరం తదితర అనేక విషయాలపై దృష్టిసారించి ఆ వివరాలన్నీ అందరికీ ఒకచోట లభించేలా 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్'ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాదు, రాష్ట్రవ్యాప్తంగా 30 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటుచేయడంతో పాటు, యువత నైపుణ్యాభివృద్ధికి రెండు యూనివర్సిటీలను కూడా ఏర్పాటుచేసేందుకు రంగం సిద్ధం చేస్తుండడం యువతకు ఒక పెద్ద ఆసరా కాబోతోంది. సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలకు స్టాంప్‌డ్యూటీ, వడ్డీరాయితీ, విద్యుత్ సబ్సిడీ ఉండేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు అందించేందుకు ఈ విధానంలో ఏర్పాట్లు చేయడంతో మహిళల్లోనూ ఆత్మవిశ్వాసంతో పాటు, ఆర్థికంగా వారు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం ఒక మంచిమార్గం వేసినట్లయింది.

### సిఎం జగన్ దార్శనికతకు ఇది నిదర్శనం

**- పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి**

పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, ఏపిఐఐసి ఛైర్మన్ ఆర్‌కె రోజా చేతులమీదుగా 2020-23 నూతన పారిశ్రామిక విధానం ఈనెల 10న మంగళగిరిలో ఆవిష్కృతమైంది. ఈ కొత్త పాలసీతో రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని, పారిశ్రామిక రంగం, విద్యారంగంతోపాటు అన్నిరంగాల్లో అనుభవజ్ఞులైన నిపుణులతో సంప్రదించిన తర్వాత ప్రపంచంలోని అత్యుత్తమ పద్ధతులన్నీ అధ్యయనం చేసిన తర్వాతనే ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు పరిశ్రమల మంత్రి గౌతంరెడ్డి చెప్పారు. దీనిద్వారా పారిశ్రామికవేత్తలతో పాటు యువత, మహిళల ఆకాంక్షలు కూడా నెరవేరుతాయని, అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా పెట్టుబడిదారులకు ప్రమాదరహిత, స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ముఖ్యమంత్రి వైయస్ జగన్ దార్శనికతకు ఈ కొత్త పారిశ్రామిక విధానం ఒక నిదర్శనమని కొనియాడారు.

# శవాలపై చిల్లర ఏరుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

రోగులకు సేవలందించడానికి కొందరు డాక్టర్లు అటు ప్రభుత్వ రంగంలోనూ ఇటు ప్రైవేటు రంగంలోనూ తమప్రాణాలను సైతం పణంగాపెట్టి సేవలందిస్తుంటే, కొంత మంది నికృష్టులు మాత్రం పైసలే పరమావధిగా, సంపాదనే తమ విధిగా సిగ్గు శరము లేకుండా దోచుకుంటున్నారు. 10 శాతమో 20 శాతమో వున్న ఇలాంటి చీడ పురుగుల వల్ల మిగిలిన 80 శాతం మందిపై కూడా ఆ ప్రభావం పడి మొత్తం వైద్య వ్యవస్థకే మచ్చ ఏర్పడే ప్రమాదముంది.

### ముందు జాగ్రత్త కోసమే...

నిజానికి ఇప్పుడు కరోనా బారిన పడుతున్నవారిలో ఎక్కువ శాతం మందికి హోమ్ ఐసోలేషన్ సరిపోతుంది, అయితే ఉన్నట్టుండి అత్యవసర పరిస్థితి వస్తుందని, ఆక్సిజన్ లెవల్స్ పడిపోతున్నాయని.. ఆలా జరిగినప్పుడు ప్రాణాపాయం ఉంటుందని కథనాలు వస్తుండడంతో అసింటమాటిక్ రోగులు కూడా ఎందుకొచ్చిందిలే అని ఆసుపత్రిలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ముందు జాగ్రత్త కోసం వాళ్ళు తీసుకుంటున్న నిర్ణయం ఇప్పుడు కొందరు డాక్టర్ల పాలిట వరంగా మారింది. లాక్‌డౌన్ కారణంగా పేషెంట్లు రాకపోవడంతో కోల్పోయిన రాబడినంతా ఇప్పుడు కొద్దికాలంలోనే ఒక్కసారిగా లాగేయాలన్న నీచమైన ఆలోచన చేస్తున్నారు.

దేశంలో ఇతర ప్రాంతాలలో పరిస్థితి ఎలా వున్నా ఆంధ్రాలో మాత్రం ఈ పరిస్థితి దారుణంగా వుంది. నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, కర్నూలు, చిత్తూరు వంటి పట్టణాల లోనే కాకుండా విజయవాడ, విశాఖపట్నం వంటి మహానగరాలలో సైతం ఇదే దందా కొనసాగుతోంది. ఆసుపత్రుల బిల్లులు చెల్లించడానికి బ్యాంకు లోన్ తీసుకోవాల్సిన పరిస్థితి కొందరిదైతే, ఆస్తులు తాకట్టు పెట్టవలసిన స్థితి మరికొందరిది. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలయితే వారి ఆస్తులు కుదవ పెట్టుకుని వైద్యం చేస్తున్నారని సమాచారం. ఇదేం అన్యాయమని ప్రశ్నిస్తే మా ప్రాణాలు పణంగా పెట్టి మిమ్మల్ని బ్రతికిస్తున్నాం, ఏం ఆమాత్రం ఇవ్వలేరా... బ్రతికి ఉంటే మళ్ళీ సంపాదించుకోవచ్చు, ప్రాణాలే పోతే ఏం చేస్తారు..? అని భయపెడుతున్నారంట. ఇలా మాట్లాడితే ఎవరైనా భయపడకుండా వుంటారా..?

### నెగటివ్ వచ్చినా పాజిటివ్ అని భయపెడుతున్నారు...

సాధారణ టెస్టుల్లో నెగటివ్ వచ్చినప్పటికీ కొన్ని ఆసుపత్రుల్లో సిటి స్కాన్లు చేసి అక్కడ కూడా డబ్బులు గుంజడమే కాకుండా వ్యాధి తీవ్రంగా ఉందని ఆసుపత్రిలో చేరాలని భయపెడుతున్నారని కూడా సమాచారం. విజయవాడ స్వర్ణ ప్యాలస్‌లో జరిగిన అగ్నిప్రమాదం అనంతరం అక్కడ వున్న రోగులకు చేసిన పరీక్షల్లో 18 మందికిపైగా నెగటివ్ వచ్చిందని తేలిందంటే అక్కడ రమేష్ ఆసుపత్రి కుట్ర ఏ స్థాయిలో వుందో బయటపడిపోయింది. ఈ డాక్టర్లకి కూడా కుటుంబాలు ఉంటాయి, బంధాలు బాంధవ్యాలు ఉంటాయి కానీ కొంతమంది డాక్టర్లకి వాటన్నిటికంటే డబ్బే ముఖ్యం, డబ్బే సర్వస్వం. 'వైద్యో నారాయణో హరి' అన్న సూత్రాన్ని మర్చిపోయి.. 'కాంచానాం కర్మ విమోచనం' అనే సూత్రాన్నే గుర్తు చేస్తున్నట్లుగా రోగుల నుంచి డబ్బు గుంజుతున్నారు.

### ప్రజలని కూడా చైతన్యవంతుల్ని చెయ్యాలి...

ఈ విషయంలో ప్రజలని కూడా ప్రభుత్వమే మేల్కొలపాలి, పల్స్ ఆక్సీ మీటర్ ద్వారా ఆక్సిజన్ మోతాదును వాళ్ళే పరీక్ష చేసుకునేలా అవగాహన కల్పించాలి. 1000 రూపాయల నుండి 2000 రూపాయల వరకూ ఇవి బహిరంగ మార్కెట్లో దొరుకుతున్నాయి. ఒక్క ఆక్సీ మీటర్ ఇంట్లో ఉంటే ఆందోళన చెందే అవసరం లేకపోగా లక్షల రూపాయలు ఇలాంటి దోపిడీదారులకు ధారబోసే అవసరమే రాదు.

### ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి ....

ప్రభుత్వం ఈ వ్యవహారంలో కఠిన చర్యలు తీసుకోకపోతే వైద్యం పేరుతో జరుగుతున్న ఈ బహిరంగ దోపిడీకి అంతం ఉండదు. ప్రతి జిల్లాలో ఇందుకోసం ఒక ప్రత్యేక పర్యవేక్షణా బృందాన్ని ఏర్పాటు చేసి ఈ దుర్మార్గపు దోపిడీని అడ్డుకోవాలి. ఇలాంటి నీచమైన పనులకు పూనుకుంటున్న యాజమాన్యాలని వారి లైసెన్సులు రద్దు చేసి భవిష్యత్తులో వాళ్ళు మళ్ళీ ప్రాక్టీస్ చేయకుండా వాళ్ళని నియంత్రించాలి. యావత్ ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న తరుణంలో కొంచెం కూడా సామాజిక బాధ్యత లేకుండా, రోగుల అవసరాన్ని అడ్డంపెట్టుకుని డబ్బు సంపాదనకు పూనుకుంటున్న, కరోనా మహమ్మారికన్నా ప్రమాదకరమైన ఇలాంటి మాయదారి డాక్టర్లని సంఘ బహిష్కారం చెయ్యాలి.

పరపతి, పలుకుబడి, కొద్దో గొప్పో ఆర్థిక స్తోమత వున్న వారి పరిస్థితే ఇలా ఉంటే, ఇక సామాన్యుడి గతి ఏం కావాలో ఒక్కసారి ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి.

# ఆదర్శ అధ్యాపకుడు టి.వి.కృష్ణారెడ్డి అస్తమయం

నెల్లూరు విఆర్ కళాశాల విశ్రాంత ఉపాధ్యాయుడు తలమంచి వెంకటకృష్ణారెడ్డి తన 101వ యేట, భారత కాలమానం ప్రకారం ఆగస్టు 10వతేదీ ఉదయం (అమెరికాలో ఆగస్టు 9వతేదీ సాయంత్రం) తుది శ్వాస విడిచారు. విఆర్ కళాశాలలో కృష్ణారెడ్డిని తెలియని పాతతరం విద్యార్థులు వుండరు. ఆర్థిక శాస్త్రం (ఎకనామిక్స్) భోధించడంలో ఆరితేరిన కృష్ణారెడ్డి క్రమశిక్షణ, అంకిత భావాలకు మారుపేరు. ఆరణాల తెలుగుతనానికి ఆయన నిలువెత్తు నిదర్శనం. ఎవరికీ తలవంచని నైజం ఆయనది, విద్యా వ్యవహారాలలో ఎంత క్రమశిక్షణతో వుండేవాడో ఆయన వ్యక్తిగత జీవితంలో కూడా అంతే క్రమశిక్షణ పాటించేవాడు. ఆయన వద్ద శిష్యరికం చేసిన వాళ్ళు చాలామంది అత్యున్నత స్థానాలకు చేరుకున్నారు. మన భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వ్యాపార దిగ్గజం జివికె రెడ్డి లాంటివాళ్ళే అందుకు సాక్ష్యం.

కృష్ణారెడ్డి పదవీ విరమణ చేసిన అనంతరం భారత దేశాన్ని విడిచి వెళ్ళిపోయాడు, భార్య శకుంతలమ్మతో కలిసి సుమారు 40 సంవత్సరాలుగా అమెరికా దేశం ఫ్లోరిడా రాష్ట్రంలోని బ్రేడింగ్‌టన్ నగరంలో తన ఏకైక కుమార్తె అల్లుడుతో ఉంటున్నాడు, రెండేళ్ళ క్రితం శకుంతలమ్మ కాలం చేసింది. భార్య దూరమై బ్రతుకుభారమైన ఆయన ఇంటినుండి వృద్ధాశ్రమానికి తన మకాం మార్చుకున్నాడు. 2020 మే 3వ తేదీన వందేళ్ళు పూర్తిచేసుకుని, ఆ సందర్భంగా నెల్లూరులోని కాన్సర్ ఆసుపత్రికి 5 లక్షల రూపాయల విరాళాన్ని కూడా ఆయన పంపించాడు. చివరి శ్వాస వరకు అత్యంత ఆరోగ్యకర జీవితాన్ని గడిపి ఆకస్మికంగా 10వతేదీ కన్నుమూశాడు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.



### ఉపరాష్ట్రపతి వెంకయ్య సంతాపం

కృష్ణారెడ్డి క్రమశిక్షణ నిబద్ధతలతో తమకు మార్గ నిర్దేశం చేసేవాడని, భావితరాలకు ఆయన జీవితం ఆదర్శమని, ఆయన మరణం తనకు బాధ కలిగిస్తోందని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఒక ప్రకటనలో తన సంతాపాన్ని తెలిపారు.

### ఆత్మీయుడిని కోల్పోయా... జివికె రెడ్డి

కృష్ణారెడ్డి మరణవార్తను తెలుసుకున్న జివికె రెడ్డి ఆయనతో వున్న అనుబంధాన్ని 'లాయర్'తో పంచుకున్నారు. కేవలం విద్యార్థిగా కాకుండా తనను బిడ్డలాగా చేరదీసేవాడని గుర్తు చేసుకున్నారు. మంచి ఆత్మీయుడిని కోల్పోయానని విచారం వ్యక్తం చేశాడు.

# డిగ్రీ పరీక్షలు వాయిదా

కరోనా ప్రభావంతో జిల్లాలో అనేక చోట్ల లాక్‌డౌన్ అమలులో ఉండడంతో ఈనెల 17 నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలను వాయిదా వేస్తున్నామని, మళ్ళీ పరీక్షలు ఎప్పుడు జరిగేది తర్వాత ప్రకటిస్తామని విఎస్‌యు పరీక్షల అధికారి సాయిప్రసాద్‌రెడ్డి ఈనెల 10న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సంకల్పసిద్ధితోనే.. అభివృద్ధి

## మూడేళ్ల తన పదవీ ప్రస్థానంపై పుస్తకావిష్కరణలో ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు



**భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. ఇప్పుడే కాదు ఎప్పుడు ఏ పదవిలో ఉన్నా ఆ పదవికే వన్నెతెస్తూ ప్రజలందరి అభిమానానికి పాత్రమవుతూనే ఉంటారు. తానెక్కడ ఉన్నా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే ఉంటారు. ఆయన మాటలు ప్రజలకు మార్గదర్శకాలు. ఆయన ఉపన్యాసాలు అందరికీ ఆదర్శప్రాయాలు.**

నిత్యం ప్రజల గురించి, వారి యోగ క్షేమాల గురించే ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎప్పుడూ ఆలోచిస్తుంటారు. తన భవ్యమైన ఆలోచనలను ప్రజలతో పంచుకుంటూ.. ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉండడమంటే ఆయనకెంతో ఇష్టం. అందుకే భారత ఉప రాష్ట్రపతిగా ఒక్కొక్క ఏడాది పదవీ కాలం పూర్తయిన సందర్భాలను ఎంతో స్ఫూర్తిదాయకమైన రీతిలో పుస్తకాల ద్వారా అందించి అందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

### మూడేళ్ళ పదవీ కాలానికి ప్రతీకగా..

### ముచ్చటైన మూడవ పుస్తకం :


తాజాగా మూడేళ్ళ పదవీకాలం పూర్తయిన సందర్భంగా 'కనెక్టింగ్, కమ్యూనికేటింగ్, ఛేంజింగ్' అనే పేరుతో రూపొందించిన ఒక అద్భుతమైన పుస్తకానికి ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ సమావేశ మందిరంలో ఈనెల 11న ఆవిష్కరణ జరిగింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించగా, ఆ పుస్తకానికి సంబంధించిన డిజిటల్ వెర్షన్‌ను కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి ప్రకాష్ జావ్‌డేకర్ ఆవిష్కరించారు. భారత ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఈ మూడేళ్ళ ప్రస్థానంలో ముఖ్యమైన పర్యటనలు, ప్రసంగాలు, కార్యక్రమాల వివరాలతో 334 చిత్రాలు, 251 పేజీలతో ఈ పుస్తకాన్ని రూపొందించడం విశేషం. గతంలో కూడా ఆయన తొలి ఏడాది, రెండవ ఏడాది పదవీకాలాలు పూర్తిచేసుకున్నప్పుడు కూడా ఇలాగే ప్రజలకు మార్గదర్శకంగా పుస్తకాలు ముద్రితం కావడం విశేషం. తొలి ఏడాది "మూవింగ్ ఆన్ మూవింగ్ ఫార్వార్డ్' అనే పుస్తకాన్ని, రెండవ ఏడాది 'లిజనింగ్-లెర్నింగ్-లీడింగ్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ ఆవిష్కరణలు అప్పట్లో ఘనంగానే జరిగాయి. ఇప్పుడు కరోనా నేపథ్యంలో ఈ మూడవ పుస్తకానికి నిరాడంబరంగానే ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ బలమైన సంకల్పం, సమిష్టి కృషితోనే ఆర్థికంగా సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఆగస్టు 2019 నుంచి మార్చి వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను కలవడం, మాట్లాడడం చేశానని, ఆ తర్వాత కరోనా నేపథ్యంలో ప్రజల వద్దకు వెళ్ళడం కుదరడం లేదని, సామా జిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరు వయ్యానన్నారు. సుమారు 1600 మందితో ఫోన్‌లో మాట్లాడానని, ప్రజలకు దూరంగా ఉన్నా ఫోన్‌ద్వారా దగ్గరయ్యానని అన్నారు. కరోనా గురించి ఎవరూ భయాందోళనలకు గురికావద్దని, త్వరలోనే సాధారణ పరిస్థితులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి పదవికి వెంకయ్యనాయుడు వన్నెతెచ్చారని, ఆయన అందరికీ ఆదర్శనీయుడని కొనియాడారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు









జననం : 26.03.1944

మరణం : 07.08.2020

ఉత్తరక్రియలు

మా తండ్రి

శ్రీ అచ్యుత సుబ్రహ్మణ్యం గారు

తేది. 07.08.2020 శుక్రవారం స్వర్గస్థులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు :

అచ్యుత శివమణికంఠ

ఉత్తరక్రియలు

తేది. 16.08.2020 ఆదివారం శిలోద్వాసన

తేది. 17.08.2020 సోమవారం పొత్తర్లు, సపిండీకరణ, వైకుంఠ సమారాధన

నెల్లూరు, రామమూర్తినగర్‌లోని మా స్వగృహము నందు జరుగును.

పంక్తి : అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపం, పోలీస్ ఆఫీస్‌రోడ్డు, నెల్లూరు.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com